2014 డిసెంబర్

# పరిశుద్ధత

ఆధ్యాత్మిక క్రైస్తవ మాసపత్రిక

ప్రధాన సంపాదకులు :

**రెవ.డా॥ కె. జోసఫ్**

సర్క్యులేషన్ :

**సామ్రాట్ కొడవటికంటి**

## లోపలి పేజీల్లో...


| | | |
|---|---|---|
| సంపాదకీయం | | 02 |
| | ఎడిటర్ | |
| అపొస్తలుడు | కొడవటికంటి | 03 |
| లియో టాల్‌స్టాయ్ | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 06 |
| దైవశక్తి | మామయ్య కథలు | 09 |
| | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | |
| అయిననేమి... | రెవ.డా॥కె. జోసఫ్ | 12 |
| స్త్రీలలో నీవు ఆశీర్వదింపబడిన దానవు | | 14 |
| | శ్రీమతి మాధురిమరియన్ | |
| క్రిస్మస్ పండుగ కాదు – మహా పండుగ | | 15 |
| | బ్రదర్ కె. సామ్రాట్‌గారు | |
| వెల్స్ ఉజ్జీవము | | 18 |
| | రెవ. డా॥ కొడవటికంటి విక్రాంత్ | |
| పండిత రమాబాయి | | 21 |
| | శ్రీమతి రిబ్కా విక్రాంత్ | |
| అక్షరయజ్ఞం – బైబిల్ క్విజ్ | | 24 |
| | శ్రీమతి కె.ప్రసన్న పరాక్రమ్‌గారు | |


**చందా వివరములు :**

సంవత్సర చందా రూ. 100/-
పోషక చందా రూ. 500/-
జీవిత చందా రూ. 1000/-
విడి ప్రతి రూ. 10/-

India Evangelistic & Relief Fellowship

| **EVANGELISM** | **RELIEF** |
|---|---|
| Church Planting | Orphanage |
| Evangelestic, Crusades | Child Development Centers |
| Pastor's Seminars | Education (U.C.L.I. Schools) |
| Youth Ministry | Widows & Leprosy Care |
| T.V.Ministry | Medical Assistance |
| Magazine Ministry | Help in Natural Calamity |
| Audio Ministry | Flood Relief |
| Jail & Prison Ministry | Mobile Medical Ministry |
| IERF International | Children Care Ministry |
| Hanna Women Ministries | |

**మా చిరునామా :**

ఎడిటర్
పరిశుద్ధత
పోస్‌బాక్స్ నెం. 28
ఒంగోలు – 523001
ఫోన్ : 08592-231281

**ప్రకటన రేట్లు**

| | | |
|---|---|---|
| టైటిల్ 4వ పేజీ | ..... | రూ. 3,000/- |
| టైటిల్ 3వ పేజీ | ..... | రూ. 2,000/- |
| లోపలి పేజీ | ..... | రూ. 1,000/- |

# సంపాదకీయం.....



ప్రభువునందు ప్రియమైన 'పరిశుద్ధత' పాఠకులకు క్రిస్మస్ మరియు నూతన సంవత్సర శుభాకాంక్షలు.

దేవుని కృపలో మరొక క్రిస్మస్ వరకు దేవుడు మనలను కాపాడి మరో నూతన సంవత్సరాన్ని కూడా చూడ్డానికి కృప అనుగ్రహించాడు. మీరు, మీ పిల్లలు అంతా సంతోషంగా ఉన్నారని, ఉంటారని విశ్వసిస్తున్నాను. మాపై చూపుతున్న ఆదారాభిమానాలకు మేము ఎంతో సంతోషిస్తున్నాము. మీరు వ్రాసే ఉత్తరాలు, చేసే ఫోన్‌కాల్స్ మాకెంతో ప్రోత్సాహానిస్తున్నాయి.

క్రిస్మస్ సర్వమానవాళికి పండుగ దినము. కులాలకు, మతాలకు అతీతమైనది. ఎందుకంటే ఆయన జన్మించిన సమయములో దేవదూతలు "సర్వోన్నతమైన స్థలములలో దేవునికి మహిమయు, ఆయనకిష్టులైన మనుష్యులకు భూమి మీద సమాధానము కలుగును గాక" అని దేవదూతలు స్తుతించారు. గొర్రెల కాపరులు దేవదూత ద్వారా "ప్రజలందరికీ కలుగబోవు మహా సంతోషకరమైన సువర్తమానము నేను మీకు తెలియుజేయుచున్నాను. దానికిదే మీకానవాలు. ఒక శిశువు పొత్తిగుడ్డలతో పరుండియుండుట మీరు చూచెదరు" అని కబురందుకొని వెళ్ళి ఆ శిశువును దర్శించారు. తాము కూడా దేవునికి స్తోత్రము చేయుచూ వెళ్ళిపోయారు. ఎప్పటినుండో నిరీక్షిస్తూ, ఎక్కడో దూరాన్నుండి బయలుదేరి ఒంటెల మీద బంగారు, సాంబ్రాణి, బోళము వంటి విలువైన వస్తువులతో బయలుదేరి నక్షత్రము దారిచూపగా బాలుడైన యేసుక్రీస్తును కనుగొని ఆయనను పూజించారు తూర్పు దేశపు జ్ఞానులు. అందుకే ఇది సర్వమానవాళి పండుగ. మీరు మీ ఇరుగు పొరుగు వారితో, క్రైస్తవేతరులతో కలసి ఈ సంతోషాన్ని పంచుకోవలసినదిగా కోరుతున్నాను.

మన 'పరిశుద్ధత' పత్రికలో ఈ నూతన సంవత్సరంలో కొన్ని క్రొత్త శీర్షికలు ప్రారంభిస్తున్నాము. ప్రార్థించండి. మీ అభిప్రాయాలు ఉత్తరాల ద్వారా, ఫోన్ ద్వారా తెలియజేయడం మరువవద్దు.

క్రిస్మస్ మరియు నూతన సంవత్సర ఆశీర్వాదాలు మీకు మెండుగా కలగాలని కోరుకూంటూ.....

–ఎడిటర్

సీరియల్

# అపొస్తలుడు

10

**– కొడవటికంటి**

"అమ్మాయి (మీర) బాగుందా?" అని అన్నాడు. ప్రస్తావన మారిపోతుందని సౌలుకు తెలుసు. ఇప్పుడు ఆ విషయం వత్తిడికి తేదలచుకోలేదు.

"బాగుంది, సన్‌హెద్రిన్ సభ సభ్యత్వం కొరకు కాకపోతే – ఇప్పట్లో ఇక్కడికి వచ్చేవాడిని కాను. ఔను – రేపు సభ ఎన్ని గంటలకి సమావేశాం అవుతుంది?" అని అడిగాడు సౌలు.

బర్నబా ఏమీ మాట్లాడలేదు.

సౌలు మళ్ళీ "సభ ఎక్కడ సమావేశం అవుతుంది?" అన్నాడు.

"తెలియదు" అన్నాడు బర్నబా కొంచెం ఇబ్బందిగా. ఇంత తొందరగా ఈ విషయం సౌలుతో చెప్పవలసి వస్తుందని ఊహించలేదు.

"అదేమిటి?తెలియదా? ప్రకటన పత్రిక నీకు రాలేదా?" అన్నాడు సౌలు.

"నేనిప్పుడు సభ సభ్యత్వానికి రాజీనామా......."

"అదేమిటి?" అన్నాడు సౌలు ఆశ్చర్యంగా.

"నజరేయుడైన యేసును మెస్సయ్యగా గుర్తించిన వారందరు సభ నుండి మాత్రమే కాదు, యూదా సమాజము నుండి కూడ వెలివేయబడతారు. యేసు ఈ లోకములో ఉన్నప్పుడే ఈ ప్రకటన వెలువడింది" అన్నాడు బర్నబా.

"అయితే ఇప్పుడు నాకు సభలో ఇవ్వబడిన స్థానం, నీ నిష్క్రమణ వలనే ఏర్పడిందా?" అని సౌలు బాధగా అడిగాడు.

"నేనొక్కడినే కాదు. యేసు సిలువ మీద వ్రేలాడబడిన రోజునే నికోదేము, అరిమతయి యోసేపు ఇద్దరూ ఆయనను మెస్సయ్యగా బహిరంగముగా అంగీకరించారు" చెప్పాడు బర్నబా.

"నికోదేముగారు కూడానా" అని సౌలు లేచి నిలుచున్నాడు.

"సాయంకాలం మరలా వస్తాను" అని సౌలు బయలుదేరబోతుంటే

"నేను కూడ వస్తాను, పద" అని బర్నబా లేచాడు.

"నేను దేవాలయం వైపు రావడం లేదు. నికోదేము గారింటికి" అన్నాడు సౌలు.

"నికోదేముగారైనా, అరిమతయిగారైనా, శిష్యులందరు ఒక చోటనే ఉంటారు" అన్నాడు బర్నబా.

"అరిమతయి పట్టణ రాజుగారు కదా? ఆయన ప్రజల మధ్య నివసిస్తారా? నికోదేము ముసలివాడు కదా! పైగా ధనవంతుడు. ఆయన సామాన్య ప్రజలతో ఎట్లు నివసిస్తాడు?" అని ఆశ్చర్యపోతూ... "అసలు వీరందరూ సామాన్యుడైన యేసును ఎలా అంగీకరించారు? అంతగొప్ప పాండిత్యము కలిగిన నికోదేముగారు, నజరేతు నుండి వచ్చిన సామాన్యుని ఎలా ఒప్పుకున్నాడు?" అంటున్నప్పుడు కోపంతో, దుఃఖంతో సౌలు యొక్క గొంతు వణికినది. వెంటనే లేచి మారు మాట్లాడకుండా గబగబా దిగి క్రింద వీధిలోకి సౌలు వెళ్ళిపోతుంటే హేలేదు, బర్నబా చూస్తూ నిలబడిపోయారే కాని పిలువలేదు.

విసుకుగా, కోపంగా వీధిలోకి వచ్చిన సౌలు ఎవరి మీద కోపంగా ఉన్నాడో, ఎందుకు కోపంగా ఉన్నాడో తనకే అర్ధం కాలేదు. మంచి కల కంటున్న వానికి నిద్రలో నుండి మెలకువ వచ్చినప్పుడు వచ్చిన కోపం – ఎవరి మీద?

దేవాలయానికి ఎదురుగా వచ్చినప్పుడు సూర్యుడు మిల్లోకోట గోపురం మీద నిలబడిపోయినట్లుగా ఉన్నాడు. సూర్యుని వేడి యెరూషలేము దేవాలయాన్ని, ఈ కొండలను ఏమి చెయ్యగలదు? మానవుని మేధస్సు దేవుని చిత్తాన్ని జయించగలదా? ఈ యేసు – అనే ఒక అనాగరికుడు గలలియలోని నజరేతువాడు, యెరూషలేములోని మేధావుల మస్తిష్కములను కూడ కదిలించ గలిగాడా?!

ఇప్పటికి 630 సంవత్సరాలు. సొలొమోను శృంగార దేవాలయం నేలమట్టం చేయబడినప్పుడు ఈ పట్టణంలోని యాజకులు ఎంతమంది ఆత్మహత్య చేసుకొని మరణించారు?

ఇప్పుడు ఎదురుగా ఉన్న ఈ దేవాలయం ఇప్పటికి యాభై సంవత్సరాల నుండి కడుతూనే ఉన్నారు, అలంక రిస్తూనే ఉన్నారు. ఇంకా ఎంతకాలం కొనసాగుతుంది? కాని నజరేయుడైన యేసు నామము ఈ దేవాలయం మొత్తం మీద మసి పూసినట్లుగా అయింది. ఇన్ని సంవత్సరాలుగా గర్వించదగిన యూదామతము, ఈ జాతి ఒక్క దేవదూషకుని వలన నాశనమయి పోతుందా?

ఏలియా ఒక్కడే అయినా – దేవుని శక్తి వలన వందమంది చేయగలిగిన పని ఒక్కడే చెయ్యలేదా? అవిశ్రాం తముగా నలభై రోజులు నడచి, తన శక్తికి మించిన ప్రయాణం చేసి హోరేబు చేరలేదా? అదే దేవుని కొరకు తను పౌరుషము కలిగిన పరిసయ్యుడు కాడా!?

దేవాలయపు ప్రాంగణం ద్వారా ప్రవేశించి, స్త్రీల విభాగం వద్ద ఉంచబడిన కానుకల పెట్టె దగ్గర వున్న అరుగు మీద కూర్చున్నాడు. ఈ రోజు ఉదయం ఈ పట్టణం తన ప్రియమైన పట్టణం.

'యెరూషలేము యొక్కక్షేమము కొరకు ప్రార్ధన చేయండి – యెరూషలేమా! నిన్ను ప్రేమించువారు వర్ధిల్లుదురు' అనిన దావీదు రాజుగారి మాటలు గుర్తుకు వచ్చాయి.

నికోదేముగారు చాలా మంచివాడు. మిగిలినవారిలాగ సంఘ సేవలో గౌరవం కొరకు ఎదురుచూడడు. ఉన్నత పదవుల కోసం ప్రాకులాడడు. గమలియేలుగారి తర్వాత ఎవరయినా అంతటివాడు ఉంటే ఆయనే! నికోదేము వయస్సుతోపాటు, ఆయనలో నిజమైన పెద్దరికము పెరిగినది. అటువంటి వ్యక్తి – ఒక నజరేయుని మోసమునకు 'ఎర' అయ్యాడు అంటే నమ్మటానికి అసాధ్యము. ఆయనను కలుసుకొని మాట్లాడాలి అనుకొన్నాడు. కాని ఆ యేసు మనుష్యుల ముఖమైనా చూడకూడదు. ఆ నామమును ఉచ్ఛరించకూడదు అనుకున్నాడు.

తనకు ఊహ తెలిసిన తర్వాత ఈ యెరూషలేము పట్టణంలో ఎంతమంది క్రీస్తులు వెలియలేదు? అందరూ ఏమయ్యారు? కాలగర్భంలో కలసిపోయారు. వారితో వారి శిష్యులు కూడ. ఈ యేసూ అంతే! అట్లాగని ఎవరికి వారు ఊరుకొని ఉంటే, ఈ రోమీయులు పరిస్థితులను వారికి అనుగుణముగా మార్చుకొంటారు. కనుక యూదుల సంగతి యూదులే తేల్చుకోవాలి. ఈ నజరేయుని నామమును, మొదట యెరూషలేము నుండి తుడిచివేయాలి. ఈ కార్యము కొరకే దేవుడు తనను ఈ పట్టణంలో ప్రవేశింప చేశాడేమో!??

ఎక్కడి తార్సుపట్టణం? ఎక్కడి యెరూషలేము? తార్సు పట్టణానికి యెరూషలేమైనా, రోమా పట్టణమైనా ఒకే ప్రయాణం. తను గమలియేలుగారి పాదముల యొద్ద యూదా మత గ్రంధాలు చదువుటకు రాకపోయినట్లైతే రోమా పౌరుసత్వం కలిగిన తను అగ్రిప్పవలే లేదా ఫేస్తువలే రోమా పట్టణంలో రాజనీతి శాస్త్రము చదువుచుండేవాడు. సౌలు కూర్చున్న స్థలముకు ఎదురుగా పదిమంది యువకులు 'అన్యజనుల ప్రార్ధనా స్థల' ప్రాంతములో పెద్దగా మాట్లాడు కొంటున్నారు. తన ప్రక్కన కూర్చున్న లేవీయుని చూచి సౌలు పలకరింపుగా "ఆ గొడవ ఏమిటి?" అన్నాడు.

లేవీయుడు అటుచూసి "ఏముంటుంది, ఈ రోజుల్లో ఎక్కడ చూసినా ఇదే కదా?! నజరేయుడైన యేసు శిష్యులతో యాజకులు కాని, పరిసయ్యులు కాని వాదనకు దిగి ఉంటారు. ప్రతిరోజు యెరూషలేములో ఏదో ఒక మూలన నజరేయూడైన యేసు నామం వినబడుతుంది" అని చెప్పాడు.

సౌలు ఒంట్లో నెత్తురు వేగంగా ప్రవహించసాగింది. ఇక అక్కడ నిలువలేక గబగబా నడచి తన గదిలోకి వెళ్ళి మంచం మీద పడిపోయాడు. ఆకలి వెయ్యలేదు. మనస్సు స్థిమితంగా నిలువటం లేదు. ఆలోచనలు ఎటు పడితే అటు పరిగెడుతున్నాయి. వాటిని స్వాధీన పరుచుకోలేని నిస్సహాయ స్థితిలో పడిపోయాడు.

సాయంకాలం అయిదు గంటలకి మెలకువ వచ్చింది. గబగబ ముఖం కడుక్కున్నాడు. అరగంటలో సభ సమావేశ మవుతుంది. ప్రధాన యాజకుణ్ణి కలుసుకోవాలి. ఆకలిగా

ఉన్నా, ఏమీ తినాలనిపించలేదు. నిద్రలేచిన తర్వాత బడలిక తగ్గింది. కాని మనస్సు అల్లకల్లోలముగా ఉంది. ఇప్పుడు ప్రశాంతత నిచ్చేదెవరు?

పట్టణానికి దక్షిణంగా బంగారు గవిని గుండా ప్రవేశించిన సౌలు, ఎడమప్రక్కగా చూస్తే ప్రధానయాజకుని ఇంటిముందు సందడి కనిపించింది. గుర్రపు బగ్గీలు ఎన్నో బయట ఉండటం చూస్తే, సభ్యులలో ఎక్కువమంది అప్పుడే అక్కడ చేరుకున్నారని తెలుస్తుంది.

ఇంతకుముందు ప్రధాన యాజకుని ఇంటికి అనేక పర్యాయాలు సౌలు వెళ్ళినప్పటికీ, ఈ రోజు తన జీవితంలో ఒక ప్రత్యేకమైన రోజు. ఈ రోజును చూడాలని తన తండ్రి ఎన్ని కలలు కన్నాడో? అసలు తను సన్‌హెడ్రిన్ సభకు ఎన్నుకొనబడతానని సౌలు ఎన్నడూ ఊహించలేదు. నజరేయుడైన యేసు వలన సభలో ఎక్కువమంది ఒక్కసారే తొలగించబడినందువల్ల తనకు ఈ అవకాశం కలిగింది. లేకుంటే తనకు ఎన్ని అర్హతలు ఉన్నా యెరూషలేము పట్టణానికి దూరమయ్యే కొద్ది సన్‌హెడ్రిన్ సభ్యత్వం కష్టతరమవుతుంది.

ప్రధానయాజకుని బంట్రోతులు – ఎప్పుడూ నలిగిన వస్త్రాలు ధరించి, రోమాసైనికుల ముందు వారి బానిసలవలె ప్రవర్తిస్తారు. బంట్రౌతులు అందరూ యూదులే! కాని వారియొక్క బీదరికము వారిని కృంగదీసింది. కాని ఈ రోజు 'సభ్యత్వ స్వీకార మహోత్సవము'కు అందరూ క్రొత్త బట్టలు ధరించి వచ్చారు.

7వ సంవత్సరములో 'లిగేట్ కురేనియ' సిరియాకు అధిపతిగా ఉన్నప్పుడు 'అన్నా'గారు ప్రధానయాజకునిగా నియమితులైనారు. ఏడేండ్లు అధికారంలో వున్న తర్వాత 'వెలిరస్ గ్రేటస్' అధికారిగా ఉన్నప్పుడు అతన్ని తొలగిస్తే, 'అన్నా'గారు తన అయిదుగురు కుమారులలో పెద్దవాడైన 'ఇశ్రాయేలు బెన్‌ఫెబి'ను యాజకునిగా చేయించాడు. తర్వాత రెండవ కుమారుడైన 'ఎలియాజరు'ను ప్రధానయాజకునిగా చేశాడు. పద్దెనిమిదవ సంవత్సరంలో తన అల్లుడైన 'యోసేపు కయప'ను ప్రధానయాజకునిగా చేయించాడు.

ఒక విధంగా రోమీయులకు డబ్బిచ్చి కొనుక్కొన్న హోదాలు మాత్రమే! నేడు సభికులలో వయోవృద్ధులు తప్ప ఈ 25 సంవత్సరాలలో సభలో చేరిన సభ్యులందరు, డబ్బుతో సభ్యత్వం కొనుక్కొన్నారు.

అటువంటప్పుడు తనని ఎందుకు సభ్యునిగా ఎన్ను కున్నారా? అని సౌలు ఆలోచిస్తూనే నడుస్తున్నాడు. బహుశా గమలియేలుగారి సూచన మేరకు ఎంపిక చేసియుండవచ్చును అనుకున్నాడు.

పూర్వం ఈ సభ దేవాలయ ప్రాంగణంలో ఒక మూల 'రాళ్ళు పరచిన స్థలములో కూడుకునేది. ఇప్పటికి దాదాపు నాలుగేండ్ల నుండి ఈ సభ కయపగారి ఇంటి దగ్గర సమావేశ మవుతున్నది.

సౌలు సమావేశ భవనంలోకి ప్రవేశించినప్పుడు కయపగారు అతి ఆడంబరమైన దుస్తులలో, సింహాసనం వంటి పీఠము మీద ఆసీనుడయ్యాడు.

అన్నాగారు లోనికి ప్రవేశిస్తున్న సౌలు దగ్గరగా వచ్చి, భుజము మీద చెయ్యివేసి ప్రక్కగా తీసుకొని వెళ్ళాడు. అన్నా గారి వయస్సు దాదాపు 65 సంవత్సరాలు ఉంటుంది. పూర్తిగా తెల్లని గడ్డం, బలమైన, ఎత్తైన శరీరము. సభ్యులు ఇంకా రావలసి ఉంది. కనుక భవనానికి ప్రక్కగా ఉన్న పాలరాతి అరుగుమీద ఇద్దరూ కూర్చున్నారు.

కుశల ప్రశ్నలు అడిగాడు. పది నిమిషాలు మాట్లాడిన తర్వాత ఇద్దరు కలసి సమావేశంలోకి వస్తున్నప్పుడు, అన్నాగారు సౌలు భుజము మీద చెయ్యివేసి ఆప్యాయంగా తీసుకొని వస్తుంటే సభ్యులందరూ చూచారు. కొంతమంది లేచి నిలబడి, అన్నాగారి దృష్టిని ఆకర్షించిన తర్వాత కూర్చున్నారు.

**(సశేషం)**

Read Our Internet Edition @

**www.holinessmagazine.com**

సీరియల్

# మైనపు దీపము - క్రొవ్వొత్తి 10
## (లియో టాల్‌స్టాయ్)

**కంటికి కన్ను, పంటికి పన్ను అని చెప్పబడిన మాట మీరు విన్నారు కదా! నేను మీతో చెప్పునదేమనగా - దుష్టుని ఎదిరింపక........**

చరిత్రలో 1862లో రెండవ అలెగ్జాండరు 600 లక్షల బానిసలను బానిసత్వములోనుండి విడుదల కలిగించక ముందు జరిగిన బానిస కథ. ఆ రోజుల్లో ప్రజలు రకరకాల ప్రభువులచే పరిపాలించబడేవారు. ఎవరో కొద్దిమంది ప్రభువులు మాత్రం దేవునియందు కొంచెమైన భయభక్తులు కలిగి బానిసలను మానవత్వంతో చూచేవారు. అయితే ఎక్కువమంది పూర్వం బానిసత్వంలో నివశించి, ప్రభువుగా ఉన్నవారు మాత్రం మానవత్వం కొంచె మైనా లేకుండా బానిసలను పశువుల వలెను క్రూరంగా దయ కొంచెమైనా లేకుండా పరిపాలించేవారు.

ఇటువంటి వారే బానిస బ్రతుకులను దుర్భరం చేసి బాధించేవారు. అటువంటి పాలకులు ముందు చిన్న రైతులుగా ఉండి యజమానుని దగ్గర మెప్పుపొంది బానిసల మీద పెత్తనం చేసేవారు.

అక్కడ నివశించే రైతు కూలీలు తమ యజమానుల దగ్గర నియమిత గడువులో మాత్రం పనిచేసేవారు. అక్కడ నేల సారవంతమైనది. అందులో దొరికే ఆహారం అందరికి సరిపోయేటంత సమృద్ధిగా ఉండేది.

అక్కడ నివశించే ఓ గొప్ప ఆసామి అక్కడ నివశించే ఓ రైతును తన ఎస్టేటులో పనిచేసే బానిసల మీద పెద్దగా నియమించాడు. అలా జరిగిన వెంటనే అతను తన వద్ద ఉన్న కట్టుబానిసలైన వారిని బహుతీవ్రంగా పరిపాలించసాగాడు. అతనికి భార్య, ఇద్దరు వివాహితులైన కుమార్తెలు ఉన్నారు. చట్టానికి సరిపోయేంతగా సంపాదించినా మిగిలే అంత ఆదాయం తెచ్చే వనరులు ఉన్నప్పటికీ అతని హృదయం కుళ్ళుతోను, కపటంతోను నిండి లోతైన పాపజీవితంలో పడిపోయాడు.

అతనిపేరు మిఖాయేల్ గోర్బవిజ్. అతను బానిసలను వారానికి వారు చెయ్యవలసిన వేళకంటే ఎక్కువగా పనిచేయిస్తూ పనివారిని నిరంకుశంగా పరిపాలిస్తుండేవాడు. ఇటుకలు వారితో తయారుచేయిస్తూ తన సొంత లాభానికి వాటిని అమ్మిస్తుండేవాడు. బానిసలంతా మాస్కో పట్టణంలో నివశిస్తున్న తమ అసలు యజమానికి ఈ సంగతులన్నీ వివరించి చెప్పడానికి మనిషిని పంపించారు. కాని వారికి సరియైన జవాబు రాలేదు. ఈ సంగతి తెలుసుకున్న మిఖాయేలు గోర్బవిజ్ తన ఆధీనములో ఉన్న వారిమీద పగ పెంచుకున్నాడు. పనివారిలోనే కొందరు దుర్మార్గులైనవారు వారిలో వారికి చాడీలు చెప్పి తగాదాలు పెట్టేవారు. ఎప్పుడైనా మిఖాయేలు బానిసల గ్రామానికి వస్తే బానిసలందరు ప్రక్కకి పారిపోయి దాక్కునేవారు. అతనిని చూస్తే ఓ క్రూర జంతువువలె కనిపించేవాడు. కాయాకష్టము చేసే ఈ బానిసలు ఈ కష్టాలకు ఎలాగో తట్టుకొని జీవించసాగారు.

భరించలేని భారమైన కాడివలె తమ అధికారి నుండి ఎలాగైనా విముక్తి పొందాలని ఓ రోజు అందరు కూడుకొని ఆలోచించసాగారు. అలానే అప్పుడప్పుడు వీరంతా రహస్యంగా సమావేశము జరిపి ఈ విషయం గట్టిగా ఆలోచించసాగారు. వారిలో కొందరు ధైర్యవంతులైనవారు - మనం నాశనమైపోయినా పరవాలేదు. కాని మానవ రూపంలో ఉన్న ఈ మృగాన్ని ఎలాగైనా కడతేర్చాలి, అది పాపం కాదు అన్నారు.

ఈస్టరు పండుగకు ముందుగా ఓ రోజు ఈ బానిసలను అడవిలో కొంతభాగము నరికి శుభ్రం చెయ్యమని మిఖాయేలు పంపించాడు. మధ్యాహ్నం భోజనానికి అందరూ ఒక చోట చేరి "ఇప్పుడు మనం పారిపోతే ఎలా ఉంటుంది?" అని ఆలోచించారు.

"ఈ యజమానికి ఇష్టం లేని పని మనలో ఎవరో ఒకరు ఎప్పుడు చేస్తారు. అప్పుడు అతను మనల్ని బెత్తాలతో చచ్చేదాక కొడతాడు. ఈ మధ్యనే 'సైమన్'ని బెత్తాలతో కొడితే చనిపోయాడు. మరి 'ఇవాన్' అనే అతన్ని ఇనుప కడ్డీలతో

కాల్చితే అతను చనిపోయాడు. మనం ఇక ఆలస్యం చెయ్యకూడదు" అన్నాడు. మిగిలిన వారు కూడా అలాగే వంత పాడారు. "మిఖాయేలు ఈ సాయంకాలం ఇక్కడికి వస్తాడు. ఆడమగ అని చూడకుండా భయంకరమైన బూతులు తిడతాడు. అప్పుడు అతన్ని గుఱ్ఱం మీదనుండి క్రిందపడేసి ఈ గొడ్డలితో ఒకటిస్తే పీడ విరగడవుతుంది" అన్నాడు ఓ యవ్వనస్తుడు.

"ఆ తర్వాత ఓ గొయ్యి తీసి చచ్చిన కుక్కను పడేసినట్లు దాంట్లో పూడ్చిపెడదాము" అన్నాడు ఓ ముదుసలి బానిస.

"మనందరము ఒక్కమాట మీద నిలబడి ఉండాలి" అన్నారు. అయితే వారిలో ఆఖరుగా మాట్లాడినవాడు పేతురు. నిజం చెప్పాలంటే మిఖాయేల్ చేతుల్లో అందరి కంటే ఎక్కువ శ్రమలు అనుభవించినవాడు అతనే. ప్రతివారం పేతురును మిఖాయేల్ చావుదెబ్బలు కొట్టేవాడు. పైగా 'పేతురు' భార్యను తన ఇంటివద్ద ఉంచుకొని వంటపని చేయిస్తున్నాడు.

అనుకున్నట్లుగానే మిఖాయేల్ గుఱ్ఱంమీద అక్కడికి వచ్చాడు. రాగానే పెద్దగా అరుస్తూ "ఈ నిమ్మచెట్టును నరికింది ఎవరు? నేను నిమ్మచెట్లను నరకవద్దని చెప్పాను. ఎవరు నరికారో చెప్పండి. లేదంటే అందర్నీ బెత్తాలతో కొట్టిస్తాను" అని అరిచాడు. తర్వాత సీదోను అనే అతను నరికాడని తెలుసుకొని అతనిని బహుగా కొట్టి 'వసలి' అనే అతను పనిసరిగా చెయ్యలేదని వానిని కొట్టి వెళ్ళిపోయాడు.

ఆ సాయంకాలం మరలా అందరు పనివారు కూడుకుని – "మనం ఏమి మనుష్యులము? మనం మనుష్యులము కాదు పిల్లులము. అందరం ఆలోచించిందేమిటి? జరిగిందేమిటి? ఎవరికివారే వేరైపోయాము. ఇక ఉపోక్షించేకంటే మరణించడం మేలు" అని మాట్లాడారు. అందరు మిఖాయేల్‌ను చంపాలని నిర్ణయించుకున్నారు.

శాంతకాముకుడైన పేతురు మాత్రం "సహోదరులారా! ఒకమాట – ప్రాణం తీయడం తేలికే. కాని ప్రాణం తీసిన వ్యక్తి యొక్క ఆత్మ పడే క్షోభ ఎవరికి తెలుస్తుంది? గోర్బవిజ్ వంటి వారికి ఇప్పటికే దేవుడు శిక్ష విధించి ఉంటాడు. మనం కొంత శాంతం వహించాలి" అన్నాడు.

ఈ మాటలు 'వసలి'కి కోపం తెప్పించాయి. "పేతురు ఎప్పుడు ఇలానే మాట్లాడుతుంటాడు. బజారులో పిచ్చి కుక్కని వెంటనే చంపేస్తాం. అది బ్రతికి వుంటే మానవులందరికి కీడు వస్తుంది. మంచివాడిని ఎవరూ చంపరు. ఈస్టరు పండుగ లోపల ఈ పని పూర్తి చెయ్యాలి" అన్నాడు.

"ఈస్టరు పండుగ లోపలే మనం ముగిస్తాము" అన్నారు. తెల్లవారితే ఈస్టరు పండుగ సెలవురోజు. కాని ఆ సాయంకాలము గోర్బవిజ్ వద్దనుండి ఓ మనిషివచ్చి "రేపు ప్రొద్దున మీరంతా పొలం దున్ని విత్తనం విత్తాలి" అని కొందరికి నీటిపని, కొందరికి దున్నేపని అప్పజెప్పి వెళ్ళిపోయాడు. బానిసలు ఒక్కమాట కూడా మాట్లాడకుండా కండ్లలో నీళ్ళుపెట్టుకున్నారు.

తెల్లవారిన తర్వాత చర్చి గంటలు మ్రోగుతుంటే అంతా చర్చికి వెళ్ళడానికి సిద్ధపడుతుంటే ఈ బానిసలు మాత్రం పనికి బయలుదేరారు. గోర్బవిజ్ కొంచెం ఆలస్యంగా నిద్రలేచి నడకకు వెళ్ళాడు. మిఖాయేలు భార్య, ఓ వివాహితురాలైన కుమార్తె టిఫిన్ తినడానికి కూర్చుంటే గోర్బవిజ్ పైపు ముట్టించి కుర్చీలో కూర్చుని తన పనివారిలో ఒకని పిలిచాడు.

"బానిసలకు నిన్న పని చెప్పివచ్చావా? వెళ్ళారా?" అన్నాడు. "వెళ్ళారయ్యా" అన్నాడు పనివాడు.

"అయినా నువ్వు పొలానికి వెళ్ళు. వాళ్ళేమి చేస్తున్నారో చూడు. వాళ్ళు నన్ను గురించి ఏం చెప్పుకుంటున్నారో ఉన్నది ఉన్నట్లు నాకు చెప్పాలి" అని పంపించాడు.

గోర్బవిజ్ భార్య ఈ మాటలన్ని విని "అయ్యా! ఈ పండుగనాడు వారిని చర్చికి వెళ్ళనివ్వు, పాపం దిక్కులేని బానిసలు" అంది.

గోర్బవిజ్ పెద్దగా నవ్వి – "నిన్ను చాలాకాలంగా కొరడాలతో కొట్టలేదు. అందువల్ల నీకు నాతో మాట్లాడే ధైర్యం వచ్చింది" అన్నాడు. "అయ్యా! నాకు రాత్రి నీమీద ఓ భయంకరమైన కల వచ్చింది. దయచేసి ఆ బానిసలను చర్చికి వెళ్ళనివ్వు" అన్నది. వెంటనే గోర్బవిజ్ లేచి వేడిగా కాలుతున్న పైపును ఆమె బుగ్గల మీద వత్తి కొరడాతో ఆ గది గదికి తిప్పి కొట్టి భోజనపు బల్ల వద్ద కూర్చుని "వంట మనిషితో రకరకాల వంటకాలు వడ్డించుకుని నేను తింటుంటాను. నువ్వు పాటలు పాడు" అని చెప్పాడు.

అలా తను సంతోషంగా ఉన్న సమయములో అడవికి వెళ్ళిన వ్యక్తి తిరిగివచ్చాడు.

"వాళ్ళు పొలం దున్నారా?" అని అడిగాడు.

"సగం పొలం దున్నారయ్యా!" అన్నాడు.

"నేను ఇప్పుడు పొలం వెళ్ళి చూస్తాను" అన్నాడు.

"మరి నన్ను గురించి చెడుగా మాట్లాడుతూ నన్ను శపిస్తున్నారా?" అన్నాడు.

ఆ పెద్దాయన తటపటాయిస్తుంటే "నిజం చెప్పు" అని గదిమాడు. "నువ్వు నిజంగా వాళ్ళు ఏమి మాట్లాడారో చెప్పు, నిజం చెబితే నీకు బహుమానం ఇస్తాను. అబద్ధం చెపితే దండిస్తాను" అని ఓ పనిపిల్లను పిలిచి "ఓ గ్లాసులో ఓడ్కా పోసి ఇతనికివ్వు, నాతో నిజం చెప్పడానికి ఇతనికి ధైర్యం వస్తుంది" అన్నాడు. ఆ ఓడ్కా త్రాగి ధైర్యంగా తలెత్తి "మీకు దేవుని భయం బొత్తిగా లేదన్నారు" అన్నాడు. గోర్భవిజ్ పెద్దగా నవ్వాడు. "ఇంకా ఏమన్నారు?" అన్నాడు. "మీకు దేవుడంటే ఇష్టం లేదన్నారు" అన్నాడు. "ఎవడు ఆమాట అన్నాడు? చెప్పు" అన్నాడు. "వారంతా ఒక మాట మీద అలా అన్నారయ్యా!" అన్నాడు. "పెద్దాయన – మీకు దెయ్యం పట్టిందన్నాడు" అన్నాడు. గోర్భవిజ్ పెద్దగా నవ్వి "వాసలి ఏమన్నాడు?" అన్నాడు. "వాసలి మిమ్మల్ని అందరికంటే ఎక్కువగా తిట్టాడు. మీరు కుక్క చావు చస్తారు" అన్నాడు. "వారిలో కొందరు మీ నడుము విరుగుతుంది" అన్నారు.

ఈ మాటలు విన్న గోర్భవిజ్‌కు కోపం రాకపోగా పెద్దగా నవ్వుతూ "ఎవరి నడుం విరుగుతుందో చూద్దాం, పేతురు ఏమన్నాడు?" అన్నాడు. "పేతురు ఏమి మాట్లాడలేదయ్యా? అతని మాటలు విన్నవారు అతని చూసి ఆశ్చర్యపోయారు" అన్నాడు. "అతను ఏమన్నాడు?" అన్నాడు గోర్భవిజ్.

"పేతురు ఏమి అనలేదు. అతను క్రొత్తగుడ్డలు ధరించి నాగలిపట్టి పాటలు పాడుతూ పొలం దున్నుతున్నాడు. అతని దగ్గర వెలుగుతున్న ఓ క్రొవొత్తి ఉన్నది. గాలికి అది ఆరిపోలేదు. పేతురు నన్నుచూసి ఈస్టరు శుభాకాంక్షలు అని చెబుతూ ముందుకు వెళ్ళాడు. ఆ క్రొవ్వొత్తి ఆశ్చర్యకరంగా ఆరిపోకుండా ఉంది" అన్నాడు.

"మిగిలిన బానిసలంతా అతని చూసి నవ్వుతూ పండుగరోజు పనిచేస్తున్నావు నీకు పాపం తగుల్తుంది అన్నారు. కాని పేతురు వారి దగ్గరగా వచ్చి 'భూమి మీద సమాధానము, మంచివారికి నెమ్మది అని మరలా పాటలు పాడుకుంటూ వెళ్ళాడు. క్రొవ్వొత్తి వెలుగుతూనే ఉంది" అన్నాడు. ఈ మాటలు వింటూనే గోర్భవిజ్ తల అతని రొమ్ము మీద ఆనింది. గట్టిగా గాలిపీలుస్తూ భారంగా నడుస్తూ తన గదిలోకి వెళ్ళి పండుకొని రొప్పసాగాడు. అతని భార్య వచ్చి "ఎలా ఉందండి?" అంది. "అతను నన్ను జయించాడు. నేను ఓడిపోయాను. నా అంతము దగ్గరగా వచ్చింది" అన్నాడు అతి కష్టంగా. అతని భార్య ఆ పెద్దాయనను పిలిచి నువ్వు వెంటనే పొలం వెళ్ళి బానిసలందరిని పని ఆపి, "వాళ్ళని ఇంటికి వెళ్ళమని చెప్పు. అంతా బాగవుతుంది" అని చెప్పి భర్త దగ్గర వచ్చి "ఎలా ఉందండి?" అన్నది. గోర్భవిజ్ "అతను నన్ను గెలిచాడు. నేను ఓడిపోయాను" అన్నాడు. అతని భార్య "నేను చెప్పినట్లు చేస్తే అంతా బాగుంటుంది" అని ఓ పనివాని పిలిచి "అయ్యగారి గుఱ్ఱం సిద్ధపరుచు" అని "మీరు బానిసల దగ్గరకు వెళ్ళండి, మీకు అంతా బాగవుతుంది" అని గోర్భవిజ్‌ను నడిపించి గుఱ్ఱం ఎక్కించింది.

గోర్భవిజ్ గుర్రం బానిసల వీధికి రాగానే ఓ స్త్రీ గేటు తలుపు తీసింది. బానిసలంతా భయంతో పారిపోయి దాక్కున్నారు. గోర్భవిజ్ గుర్రం మీదు మరియొక గేటు వద్దకు వస్తే అది మూయబడి ఉంది. తను క్రిందకి దిగలేక "ఎవరక్కడ?" అని పెద్దగా చాలాసార్లు పిలిచినా ఎవరూ రాలేదు. అతను గుఱ్ఱం దిగి గేటు తీసి మళ్ళీ గుర్రం ఎక్కబోతుంటే అటుగా వచ్చిన పందిపిల్లను చూసి గుర్రం బెదిరి ప్రక్కకు జరిగింది. గోర్భవిజ్ వెల్లకిలా పడ్డాడు. ఆ కంచెలోవున్న ఓ పదునైన కర్ర గోర్భవిజ్ పొట్టలో లోతుగా దిగిపోయింది. గోర్భవిజ్ పెద్దగా అరచి స్పృహ తప్పిపోయాడు. సాయంకాలం బానిసలు పనినుండి తిరిగి వచ్చినపుడు తమ యజమాని గుర్రం కనిపించింది. అక్కడే రక్తపు మడుగులో గోర్భవిజ్ మృతదేహం పడివుంది. పేతురు గబగబ వచ్చి చూచి తెరుచుకొని ఉన్న గోర్భవిజ్ కండ్లు మూసి దేహాన్ని ఓ బండిలో ఆ యజమాని ఇంటికి తెచ్చాడు.

మాస్కోలో ఉన్న పెద్ద యజమాని తన పనివాడైన గోర్భవిజ్‌కి సంభవించిన చావు సంగతి విని వచ్చాడు. బానిసలను అతను పెట్టిన బాధలు విన్నాడు. బానిసలందరిని విడుదల చేస్తూ ఆ పొలంలోనే పనిచేసుకొని జీవిస్తూ నామకార్థ అద్దె చెల్లించమన్నాడు. దేవుని శక్తిమంచితనముతో బయలుపరచబడుతుంది. కాని దుర్మార్గతతో కాదు అని ఆ బానిసలంతా తెలుసుకున్నారు.

**(సశేషం)**

చిన్నపిల్లల పేజి

# దైవశక్తి




పరిశుద్ధ మాసపత్రిక చదువుతున్న చిన్నారులందరికి క్రిస్మస్ దీవెనలు కొన్ని నెలలుగా మామయ్య కథలు ప్రచురించనందుకు చాలా విచారిస్తున్నాము. కారణం మీ మామయ్య విదేశాలకు వెళ్ళుటకు దేవుడు ఆశీర్వదించటమే. చాలామంది చిన్నారులు పెద్దవారు కూడా పత్రిక వెలువడగానే మామయ్య కథలు లేవే అని కోపంగాను నిష్టూరంగాను ఫోన్‌లు చేస్తున్నారు. అందరికి క్షమాపణలు. ఈ నెలనుంచి మామయ్య కథలు క్రమముగా ప్రచురించ గలమని తెలియజేయుటకు సంతోషిస్తున్నాము. యేసు ప్రభువు శిష్యుడైన తోమాగారు మన దేశానికి యేసు సువార్తను తెచ్చిన మొదటి అపొస్తలుడు. ఆయన కేరళ, మద్రాస్ రాష్ట్రాలలో యేసు సువార్తను ప్రకటించి ఎన్నో అద్భుతాలు చేసి అనేకమందిని ప్రభువులోకి నడిపించాడు. చరిత్ర ప్రకారం ఈయన క్రీస్తు శకము 52లో కేరళలోని ముజిరిస్ (muziris) ఇప్పటి కాలములో పరవూర్‌లో అడుగుపెట్టి సువార్త ప్రకటించడం మొదలుపెట్టాడు. ఎంతో మంది ఆ ప్రదేశపు ప్రజలందరు మద్రాసు రాష్ట్రంలోని అనేక ప్రజలందరు కూడా ఈయన బోధనలను అద్భుతా లను నమ్మి క్రీస్తుని అంగీకరించారు. ఇది క్రైస్తవేతరులకు అన్యమతస్తులకు అసుయా ద్వేషములు కలిగించి మద్రాస్ లోని మైలాపూర్ అనే పట్టణములో రాళ్ళచేత కొట్టి బల్లెముతో పొడిచి చంపివేశారని చరిత్రకారులు వ్రాసి వున్నారు. అప్పటి కాలంలో జరిగిన సంఘటన ఇది.

కేరళలోని కొట్టాయిం అను నగరంలో అప్పుడు అది చిన్న ఊరు, ఆ ఊరి ప్రక్కనే వున్న ఒక చిన్న కుగ్రామం వుండేది. యేసు శిష్యుడైన థామస్‌గారు పట్టణాలలో పల్లెల్లో యేసు సువార్తను ప్రకటిస్తు మావవాళిని రక్షించుటకు దైవ కుమారుడైన యేసు ఈ లోకమునకు వచ్చాడని మనుష్యు లందరి పాపము కొరకు సిలువలో బలియైపోయాడని అందుకు తాము ప్రత్యక్ష సాక్షులమని బోధిస్తూ యేసు నామమున అనేకమైన స్వస్థతలు అద్భుత కార్యములు చేయసాగాడు. కేరళ రాష్ట్రం మంత్రాలతో, దుష్టశక్తుల ఉపాసనకు చాలా ప్రసిద్ధమైనది ఇప్పటికి కూడా కేరళ మాంత్రికులు చేతబడులకు బాణామతి వంటి మంత్రాలు ప్రయోగించడంలో ప్రసిద్ధులు. వారు దుష్టశక్తులకు జంతువు లను, నరబలులను అర్పించేవారు. అయితే తోమాగారు దైవశక్తితో దెయ్యాలను పారద్రోలడం కుంటి, గ్రుడ్డివారిని స్వస్థపరచడం వలన వీరి మంత్రాలకి మాయాలకి ధనా ర్జనకు చాలా ఆటంకమైంది. అందువలన ఇతన్ని ఏవిధంగా నైనా సరే ఆ ప్రాంతం నుండి వెళ్ళగొట్టాలని లేక చంపాలని చాలా ప్రయత్నాలు చేశారు. అయితే దేవుడు తోడుగా వుండటం వలన వారి ప్రయత్నాలన్ని విఫలమైపోయాయి. తన సువార్త సేవలో తోమాగారు ఈ కొట్టాయిం ప్రక్కనున్న కుగ్రామానికి వెళ్ళారు. ఆ గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న అనేకమందిని స్వస్థపరచాడు. దురాత్మ పీడుతులకు విడుదల కలుగజేశాడు. ఆ ఊరిలోనే రాము పిళ్లై అనే ఒక బీదవానికి చిన్నికుట్టి, ఉన్నికుట్టి అనే ఇద్దరు

ఆడపిల్లలు 10,8 సంవత్సరాలవారు 5 సంవత్సరముల బాలమురగన్ అనే బాలుడు వున్నారు. అతడు భార్య కౌసల్యాకు వెన్నెముక విరగడంవలన ఎప్పుడు మంచం మీదే పడివుండేది. రాముపిళ్లై ఎంతోమంది వైద్యులకు చూపించారు. కాని స్వస్థత కలగలేదు. కేరళ మంత్రగాళ్ళు కూడా దుష్టశక్తుల ప్రభావంతో బాగుచేయాలని విఫలు లయ్యారు. అయితే కన్నప్పన్ అనే మాంత్రికుడు మాత్రం వారి ఇంటికి వచ్చి ఆ ఇంట్లో ఒక దుష్టశక్తి వుందని ఆ దుష్టశక్తులను పారద్రోలడానికి అమావాస్య రోజున నరబలి చేయావలసి వుంటుందని అని చెప్పి ఆ ఇళ్ళంతా పసుపు తోటి నిమ్మకాయలతోటి పూజచేసి చుట్టు ముగ్గులు వేసి వెళ్ళాడు. ఆ రోజు రాత్రి నుంచి ఆ ఇంటిలో వింత వింత శబ్ధాలు రాత్రి పన్నెండు గంటలు తరువాత ఎవరో ఇద్దరు స్త్రీలు జుట్టు విరబోసుకొని లీలగా ఆడపిల్లలిద్దరికి కన బడటం మొదలైయింది. ఆ పిల్లలు ఇరువురు భయంతో కేకలు వేయడం వాళ్ళ నాన్న పరుగెత్తుకొని వచ్చి పిల్లలను దగ్గరకు తీసుకొని వాల్లేదో చెడ్డ కలలు కని భయపడుతున్నా రని తండ్రి భావించాడు.

అప్పటినుంచి పిల్లలందరు తండ్రి దగ్గరే పండు కోవడం మొదలుపెట్టారు. ఆ తరువాత అమావాస్య ఇంకా నాలుగురోజులు వుండటం వలన ఆ దురాత్మలు రెండు ఆ చిన్నపిల్లవానికి పట్టుకోబోవటం జబ్బుతోపడివున్న తల్లికూడా చూచింది. ఇంటిలో పెద్దగోల మొదలైంది. రాత్రి ఎవ్వరు నిద్రపోలేదు. తెల్లవారుతుండగానే మాంత్రికుడు దగ్గరకు వెళ్ళి జరుగుతున్న సంగతులను గురించి చెప్పాడు. అప్పుడు ఆ మాంత్రికుడు రాత్రి వాళ్ళ ఇంటికి వస్తానని భయపడవద్దని పూజకు కావలసిన సామానుల జాబితా ఇచ్చి పంపించివేశాడు. ఆ రోజు సాయంత్రం 7 గంటలకి ఆ మాంత్రికుడు ఇంటి మధ్యలో ముగ్గువేసి, పసుపు ముద్దలు చేసి, నిమ్మకాయలు పెట్టి, మంత్రాలు జపించడం మొదలు పెట్టాడు. సరిగ్గా రాత్రి 12 గంటలకు వికృతమైన అరుపులు పది తెలియని భాషల్లో పెద్దపెద్ద మాటలు అందరికి వినబడినాయి. ముగ్గురు చిన్నబిడ్డలు రాము అతని భార్య కూడ ఎంతో భయంతో వణికిపోయారు. అప్పటి కాలంలో కరెంటు లేదు. కిరసనాయిలు దీపాలు వుండేవి. ఈ అరుపులుతో పాటు సుడిగాలి వీచి దీపాలు ఆరిపోయినవి. ఈ సుడిగాలి దెబ్బకు ఇంటిలోని వస్తువులు సామానాలు అటు ఇటు విసరి వేయబడ్డాయి. మాంత్రికుడు మాత్రం పెద్దపెద్దగా మంత్రాలు చదవడం మొదలుపెట్టాడు. అంతలో శబ్దాలు ఆగిపోయాయి. గాలి ఆగిపోయింది. పొయిలో వున్న నిప్పుతో చిన్నగా దీపాలు వెలిగించారు. ఆ మసక వెలుగులో గుమ్మము దగ్గర ఒక వికృతమైన ఆకారం నిలబడటం చూచి భయంతో వణికిపోయారు. పిల్లలు మూర్ఛపోయారు. తరువాత ఆ ఆకారం మాయమైపోయింది. ఆ మాంత్రగాడు తెల్లవార్లు అక్కడే వున్నాడు. ప్రొద్దున అతను చెప్పినదేవంటే ఒక దుష్టశక్తి ఆ ఇంటిని పీడిస్తుంది. ఒక చిన్నబిడ్డ రక్తం బలియిస్తే వదిలిపోతుందని లేకపోతే ఆ ఇంటి అంతటిని నాశనం చేస్తారని చెప్పాడు. తల్లిదండ్రులకు ఏం చేయాలో తోచలేదు. చూస్తు చూస్తు తమ చిన్న బిడ్డ బాలమురగన్‌ని ఏవిధంగా బలి ఇవ్వగలరు. ఎంతో బాధతో కుమిలిపోతున్నారు. ఇంట్లో వంటావార్పు ఏమి జరగలేదు. ఇంట్లో వారందరు కన్నీరు మున్నీరైసాగారు. ఉదయం 10 గం॥లకు ఆ గ్రామమంతా కోలాహలంగావున్నది. తండ్రి విచారించగా విదేశమునుంచి ఒక క్రైస్తవ మతభోదకుడు వచ్చాడని అపవిత్రాత్మ పీడతు లను రోగులను స్వస్థపరుస్తున్నాడని జనులు గుంపులు గుంపులుగా పోసాగారు. రాముపిళ్లైకూడ జబ్బుగా వున్న భార్యను ఇంటిలో పెట్టి తన ముగ్గురు బిడ్డలను తీసుకొని ఆయన దగ్గరకు వెళ్లారు. ఆయన దగ్గరకు వెళ్ళటానికి సందులేదు తోమాగారు ఒక ఎతైన స్థలంలో నుంచుని అందరిని కూర్చోమని సైగచేసి యేసు బోధలు చెప్ప సాగాడు. ఆ బోధలు అందరిని ఆశ్చర్యపరిచినవి. మానవాళి పాపముల నిమిత్తము, రోగములు నిమిత్తం ఏ బలులు ఇవ్వనవసరం లేదు. పరిశుద్ధుడైన దేవుని కమారుడే బలియైపోయాడు. ఇక ఏ బలి అవసరంలేదు అని బోధింపసాగాడు. అయితే రాముపిళ్లైకి ఆ బోధన మీద

అంత గురికుదరలేదు. కాని పిల్లల ముగ్గురు బాగా ఆకర్షితులైనారు ముఖ్యంగా ఆయన ముఖంలో వున్న కాంతి ప్రశాంతత వారిని ఆకర్షించాయి.

ఆయనను కలవాలని తండ్రిని బలవంతం చేశారు. ఎంతో బలవంతం మీద తండ్రి ఒప్పుకొని తోమా దగ్గరకు వెళ్ళి జరిగిన సంగతులన్ని వివరించారు. అప్పుడు తోమా తండ్రికి ధైర్యం చెప్పి ఇక ఏ మాంత్రికుడని పిలవవద్దు యేసు నామం నీ ఇంటిలో ఉచ్ఛరిస్తు వుండు అని అందరికి సిలువలు మెడలో వేశాడు. ఆ సిలువలు వేయంగానే పిల్లలి ముగ్గరికి ఎంతో ధైర్యం వచ్చినట్టుగా, ఎంతో బలం వచ్చినట్టుకూడ అనిపించింది. వాళ్ళ నాయన మాత్రం దండ వేసుకోలేదు చేత్తోనే పట్టుకొని ఇంటికి బయలుదేరాడు. ఒక పది అడుగులు వెళ్ళిన తరువాత పెద్దకుమార్తె రివ్వున తిరిగి వచ్చి తోమాగారిని వాటేసుకొని మీరు ఒక సారి మా ఇంటికి రమ్మని బతిమిలాడసాగింది. తన చుట్టు ఎంతోమంది జనముంటారు. ఎప్పుడు ప్రార్థనలు స్వస్థతలు తమకు వీలుకాదని తోమాగారు చెప్పారు. చిన్నికుట్టి కన్నీళ్ళ పర్యంతమై బ్రతిమలాడ సాగింది. అప్పుడు తోమాగారు అమ్మా మిక్కలి అవసరమైతే నన్ను పిలువు నేను ఇక్కడే ఒక పక్షం రోజులు వుంటానని చెప్పాడు. ఆ మాటకు సంతోషించి చిన్నికుట్టి పరిగెత్తు కుంటు తన నాన్నతో ఇంటికి వెళ్ళింది. ఇంటికి వచ్చిన తరువాత జరిగిన సంగతంతా పిల్లలు వాళ్ళమ్మకి చెప్పారు. ఆమె ఎంతో ఆనందించి భర్తని నీ సిలువ ఏదని అడిగింది. నాకు ఆ యేసు మీద ఏమి నమ్మకం లేదు. మనుష్యుల చేత కొట్టించుకొని సిలువ మీద మరణించిన అతనికి ఏమి శక్తి వుంటుందని ఎగతాళిగా మాట్లాడి తన చేతిలో వున్న సిలువ దండను భార్య మీదికి విసిరివేశాడు. ఆ సిలువ తనని తాకగానే ఆమెకెంతో హాయి అనిపించింది. తన బాధకూడ తగ్గినట్టుగా అనిపించింది. వెంటనే ఆమెకు తెలియకుండానే ఆమె నోటినుండి యేసయ్యా యేసయ్యా అనే మాటలు వచ్చినవి. వెంటనే ఆ ఇంటిలో వికృతమైన శబ్దాలు వచ్చాయి. నక్కలు అరుపులు వినబడ్డాయి. అది అడవి ప్రాంతం కాబట్టి ఏవో నక్కలు అరచి వుంటాయను కున్నారు. ఆ రాత్రి 8 గంటలు అవగానే మరలా ఆ మాంత్రికుడు వచ్చాడు. ఎప్పటిలాగే పూజలు చెయడం మొదలుపెట్టాడు. పిల్లలు తల్లిదగ్గరే వున్నారు. తండ్రిమాత్రం మాంత్రికుడు దగ్గర వున్నాడు. ఉన్నట్టుండి ఒక పెద్ద శబ్దం అయ్యింది. పిల్లలందరు కెవ్వున కేక వేశారు. మాంత్రికుడు పూజచేస్తున్న ప్రదేశంలో ఆకస్మాత్తుగా భారీ ఎత్తున జడలు విరబోసుకొని నిలబడివున్న ఒక వికృతమైన స్త్రీ కనబడింది. ఏదో తెలియని భాషలో గద్దిస్తూ మాట్లాడుతు ఉంది. కొద్దిసేపు మాట్లాడి మాయమైపోయింది. అప్పుడు మాంత్రికుడు రాముపిళ్లై మీద కోపంతో ఇంత ఆలస్యం చేస్తే లాభంలేదు. రేపు రాత్రి 12 గం॥లకు నీ చిన్న కుమారుడిని బలి ఇవ్వకపోతే మీ ఇంటిలోని వారందరి రక్తము త్రాగి చంపుతానని ఆ దురాత్మ బెదిరిస్తున్నట్టుగా చెప్పాడు. బిడ్డను బలిచ్చి అందరి ప్రాణాలు కాపాడు కుంటావో లేక అందరి ప్రాణాలు తీసేసుకుంటోవో ఆలోచించుకో అని చెప్పి వెళ్ళిపోయాడు. ఆ మాట వినగానే అందరు భయంతో వణికిపోయారు. తల్లి మూర్ఛపోయింది. చిన్నికుట్టి, ఉన్నికుట్టి తమ్ముడిని కౌగిలించుకుని ఏడ్వటం మొదల పెట్టారు. అలా ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లి మగత నిద్రలో పడిపోయారు. తెల్లవారు జాము 4 గం॥ ఏదో భీకర కీచులాట అందరు ఉలిక్కిపడి లేచారు ఒక వంద పిల్లులు కరచుకుంటున్న శబ్దం ఉన్నట్లుండి ఆ కీచులాట ఆగిపోయి పెద్దమూలుగు వినిపించింది అందరు ఆ మూలుగు వస్తున్న వైపు చూచారు. చిన్నబిడ్డలు ఆ దృశ్యం చూచి పెద్దగా అరిచారు. అదొక పెద్ద...........

ముగింపు వచ్చే సంవత్సరము.

(మనము ఏమైయున్నామో జ్ఞాపకం చేసుకొనుడి. మరచిపోవద్దు. క్రీస్తు యేసు నందు మనకు జయం ఇస్తున్న తండ్రియైన దేవునికి కృతజ్ఞాతాస్తుతులు చెల్లించెదము).

**Wish you Happy Christmas**



# అయిననేమి....

రెవ.డా॥ కె. జోసఫ్

ప్రభువునందు ప్రియమైన పాఠకులకు ఈ **"అయిననేమి"** అనే శీర్షికను జాగ్రత్తగా చదివి గ్రహించవలనని మనవి.

ఈ అయిననేమి? అనే పదము గిద్యోనుతో దూత పలికిన మాట న్యాయాదిపతులు 6:16వ సందర్భమేమంటే ఇశ్రాయేలీయులు యెహోవా దృష్టికి దోషులైనందును యెహోవా ఏడేండ్లువారిని వారి శత్రువులైన మిద్యానియుల చేతికి అప్పగించెను. కనుక మిద్యానియుల బలము హెచ్చి ఇశ్రాయేలీయులను మిగుల బాధించడం వలన ఇశ్రాయేలీయులు కొండలలోను, గృహాలలోను దాగవలనివచ్చించది.

మిద్యానియులు వారు పండించిన పంటను వారి పశువులను దోచుకొని ఇశ్రాయేలీయులను బహుగా హింసించిరి. అందువలన ఇశ్రాయేలీయులు మిక్కిలి హీనదశకు వచ్చి యెహోవాకు మొర్రపెట్టసాగిరి. కరుణామయుడు దయాళుడు క్షమించుటకు సిద్దమనస్సు కలిగిన దేవుడు వారిలో నుంచే ఒకనిని రక్షకుణిగా సిద్దపరిచాడు. అతనే గిద్యోను. ఇతను ఇశ్రాయేలీయులలో మనష్షే గోత్రములో ఒక పెద్ద. ఇశ్రాయేలీయులు యెహోవాను విడిచి బయలు దేవతలను పూజించుటకు బయలు దేవత కొరకు ఒక బలిపీఠము కట్టించి ధ్వజస్థంబములు నిలబెట్టినవాడు ఇతని తండ్రి. అటువంటి నమ్మక ద్రోహి కడుపున పుట్టినవాడు ఈ గిద్యోను. అంత మాత్రమేకాక దేవునియందు విశ్వాసము లేనివాడు, పిరికివాడు మిక్కిలి భయస్థుడు. ఇశ్రాయేలీయులను రక్షించుటకు ఇటువంటి బలహీనుని దేవుడు ఏర్పాటు చేసుకున్నాడు. ఎంత ఆశ్చర్యమో ఆలోచించండి దేవుని కార్యములన్ని ఈ విధంగానే చాలా ఆశ్చర్యంగా ఉంటాయి.

దేవుని బిడ్డలు కొద్దిమందిగాను బలహీనులుగాను వుంటారు. శత్రువులే బలవంతులుగాను అనేకులుగాను వుంటారు. కాని దేవుడు బలహీనులచేతనే ఎప్పుడు బలమైన కార్యాలు జరిగిస్తూ వుంటాడు. నా చిన్నతనంలో దావీదు గొల్యాతు కథలో ఎప్పుడు ఒక అనుమానం పీడిస్తూ వుండేది. ఏమంటే గొల్యాతులాంటి బలవంతులను ఇశ్రాయేలియులలో కదా పుట్టించాల్సింది. ఎందుకు శత్రువులలో పుట్టించాడు. అప్పుడు ఈ గొడవంతా వచ్చేది కాదు కదా అని అనుకునే వాడిని అయితే దేవుడు తన బిడ్డలను విశ్వాసంలో బలపరచటానికి ఇటువంటి కార్యాలు జరిగించాడు. లేకపోతే ఇశ్రాయేలీయులు తమ బలముచేతనే శత్రువులను జయించామని విర్రవీగి వుండేవారు. "తమకు దురవస్థ సంభవింపగా వారు నన్ను బహు శీఘ్రముగా వెదుకుదురు" అని పలికిన మాటలు గుర్తుంచుకోండి. హోషయా 5:15.

ఇప్పుడు గిద్యోను మిద్యానియులకు భయపడి గానుగ చాటున గోధుమలను దుళ్ళగొట్టుకొనుచుండగా యెహోవా దూత అతనికి కనబడి "పరాక్రమముగల భలాధ్యుడా యెహోవా నీకు తోడైయున్నాడు". అని అతనితో అనగా గిద్యోను ఆ దూతతో (బహుశా గిద్యోను అతనిని దూతగా గుర్తించి వుండడు ఏదో ఒక ప్రవక్త అని అనుకొని వుండవచ్చు). ఎగతాళిగా 'చిత్తము నా ఏలినవాడా దేవుడు మాకు తోడైవుంటే ఇదంతయు అనగా ఈ ఓటములు ఈ అపజయాలు ఈ దాగివుండటాలు ఈ రోగాలు ఈ అసమాధానాలు మాకెందుకు సంభవించాయి. ఐగుప్తులో నుండి అనగా 450 సంవత్సరములు బానిసత్వంలో నుండి మమ్మల్ని విడిపించెనని ఎర్రసముద్రమును చీల్చెనని బండలో నుండి నీరు రప్పించెనని మా పితరులు మాకు వివరించిన ఆ కాకమ్మ కథలు (అద్భుత కార్యములు) ఏమైనవి. దేవుడు ఎప్పుడో మమ్మును విడిచిపెట్టి మిద్యానియుల చేతికి అప్పగించాడు. పైగా నేనేదో భయపడి గానుగ చాటున గోధుమలను కొద్దికొద్దిగా దుళ్ళగొట్టుకుంటుంటే నన్ను పరాక్రమముగల బలాద్యుడా అని సంభోదిస్తున్నావు అంత ఎగతాళిగా వుందా' అని అన్నట్లుగా మాట్లాడి వుంటాడు.

అప్పుడు దూత బలము తెచ్చుకొని మిద్యానియుల చేతిలో నుండి ఇశ్రాయేలీయులను రక్షించుటకు నిన్ను పంపిన వాడను నేనే అని దేవుని పక్షముగా పలికినప్పుడు గిద్యోను గ్రహించలేదు ఈ మాటలు దేవుడే పలికిస్తున్నాడని గ్రహించ లేదు. దేవునికి అసాధ్యమైనది ఏదీ లేదు అని గ్రహించలేదు. దేవుడు మమ్మును విడిచిపెట్టాడు అని దేవుని మీద నింద వేస్తున్నాడు. కాని తామే దేవుని విసర్జించాము అని గ్రహించ లేదు. న్యాయా. 10:13. అందువలనే తమకు కీడు సంభవిం చిందని గ్రహించలేదు 2సమూ. 15:23.

పైగా తాను మిక్కిలి బలహీనుడనని తనకి సహాయపడే వారు ఎవరు లేరని తన కుటుంబము మనష్షే గోత్రములో ఎన్నికలేనిదని తాను అన్నిటిలో కనిష్ఠుడని ఇటువంటి తను దేని సహాయముచేత తాను బలవంతులైన మిద్యానియులను ఎదుర్కొని ఇశ్రాయేలీయులను విడిపించగలడని పలికాడు. అతని జవాబులో చాలా రీజనింగ్ వున్నది. నిజముగానే మిద్యానియులు, అమాలేకీయులు, తూర్పువారు అనగా తాను ఎదుర్కొనబోయే వాళ్ళు మహాబలవంతులు, ఇశ్రాయేలీయుల కంటే మహా అధికులుగా వున్నారు. తాను మిక్కిలి అల్పుడుగా కనబడుతున్నాడు. నిజమే మరి అతను పలికిన మాటలు చాలా సమంజసముగానే కనబడుతున్నాయి. ఇదే విధమైన మాటలు మహా నాయకుడైన మోషే దేవునితో మొదటిగా మాట్లాడాడు. నిర్గమ 4:1-13. యిర్మీయా కూడా మాట్లాడి నాడు. యిర్మీయా 1:4-10. ఇక్కడ వీరందరూ తమ బలహీన తలను చూచుకుంటున్నారేగాని తమను ప్రోత్సహిస్తున్న దేవుని బలమును మొదట్లో గ్రహింపలేదు. అయితే దేవుడు వారిని బలపరచాడు. గిద్యోను కూడా అదే విధంగా తన బలహీనత లను దూతతో చెప్పుకున్నాడు. అయితే దూత పలికిన మాటను గ్రహించండి.

**<u>అయిననేమి</u>** నేను నీకు తోడైయుందును. గనుక నీవు జయించుదువు. ఇప్పుడు ఇక్కడ ఆత్మీయంగా ఈ **<u>అయిననేమి</u>** అను మాటను మనకు అన్వయించుకోవాలి. మనలో చాలా మంది నేను పాపిని అంతగా భక్తిలేనివాడిని నేను దేవుని కార్యము చేయడానికి తగుదునా. నాలో దొంగతనం వుంది. అబద్ధాలు వున్నది లోకసంబంధమైన వాటిలో చిక్కుకుని వున్నాను. నాలో చాలా దుర్గుణాలు వున్నాయి, నేను దైవ కార్యములకు పనికి వస్తానా అని మనవైపు చూసుకుంటు మరింత బలహీనపడి నిరాశపడిపోతుంటాము. అయితే దేవుడు మనవంటివారి కొరకే చేతులు చాపి నిలబడివున్నాడని గ్రహించలేము." తమ ఆలోచనలను అనుసరించి చెడు మార్గమున నడుచుకొనుచు లోబడనొల్లని ప్రజలవైపు దిన మంతయు నా చేతులు చాపుచున్నాను. యెషయా 65:2. ద్రోహినివగు ఇశ్రాయేలూ తిరిగి రమ్ము.... మీ మీద నా కోపము పడనీయను. యిర్మీయా 3:12. భ్రష్టులైన బిడ్డలారా తిరిగి రండి మీ అవిశ్వాసమును నేను బాగుచేసెదను. యిర్మీయా 3:22. ఇంకా మనము యెషయా 43:24లో చూచినట్లైతే... నీ పాపములచేత నన్ను విసిగించితివి నీ ద్వేషములచేత నన్ను ఆయాసపెట్టితివే (అయితే) నేను నేనే నా చిత్తాను సారముగా నీ అతిక్రమములు తుడిచి వేయుచున్నాను నేను నీ పాపములను జ్ఞాపకము చేసుకొనను అని మహా దేవుడు సెలవిస్తున్నాడు. కీర్తనలు 103:14లో మనము నిర్మించబడిన రీతి ఆయనకు తెలిసేయున్నది మనం మంటివారమని ఆయన జ్ఞాపకము చేసుకొనుచున్నాడు. 10 వచనంలో మన పాపములనుబట్టి మనకు ప్రతీకారము చేయలేదు. మన దోషములనుబట్టి మనకు ప్రతిఫలము ఇయ్యలేదు. ఈ వాక్యభాగములన్ని ఎందుకు తెలియ జేస్తున్నానంటే మరి దేవుడు ప్రేమగల వాడు కదా మనము పాపము చెయ్యవచ్చు నని కాదు. మనలో ఎటువంటి బలహీనతలు వునప్పటికి కూడా, గిద్యోను బలహీనతలన్నీ చెప్పినప్పుడు దేవుడు పలికిన మాటలు చూడండి.

"**అయిననేమి** ఇటువంటి బలహీనతలు వున్నప్పటికి కూడా దేవుని దగ్గరకు రావడానికి నీవు అపాత్రుడవు కాదు. ఎన్ని బలహీనతలు వున్నప్పటికి దేవుడు **అయిననేమి** అని నీతో నాతో అంటున్నాడు. ఆయన దయాళుడు క్షమించుటకు సిద్ధమనస్సు గలవాడు. తన యొద్దకు వచ్చువారిని ఎన్నడూ త్రోసివేయని దేవుడు. మనవంటివారి కొరకే యేసు ఈ లోకమునకు వచ్చియున్నాడు. పాపులను రక్షించుటకు క్రీస్తు యేసు ఈ లోకమునకు వచ్చియున్నాడు. నశించిన దానిని (నిన్ను నన్ను) వెదకి రక్షించుటకు మనుష్యకుమారుడు (యేసు) వచ్చెను.

కనుక ప్రియ మిత్రులారా! బలహీనులను బలపరచుటకే యేసు ఈ లోకానికి వచ్చాడు. నీవు ఎంత ఘోర పాపములో ఉన్నా "అయిననేమి" దేవుడు నిన్ను పవిత్రునిగా చేసి గొప్ప కార్యములు చేయించగలడు. ఇదే క్రిస్మస్ సందేశం.

**Happy Christmas**

# స్త్రీలలో నీవు ఆశీర్వదింపబడిన దానవు



**శ్రీమతి మాధురి మరియన్**

ప్రభువును రక్షకుడైన యేసయ్య నామమున మీ అందరికి క్రిస్మస్ శుభాకాంక్షలు. బాగున్నారా? మీ అందరి కోసం మేము ప్రతిదినము ప్రార్థిసున్నాము.

ఎవరైనా మనలను చూచి నీవు ధన్యురాలవని చెప్తే మనకు ఎంత ఆనందమో కదా! మరియమ్మను చూచి ఎలీసబెతు పరిశుద్ధాత్మతో నిండుకొనినదై బిగ్గరగా ఇట్లనెను "స్త్రీలలో నీవు ఆశీర్వదింపబడిన దానవు. నీ గర్భఫలమును ఆశీర్వదింపబడును". ఈ శుభవచనాలు పలుకటానికి దాని వెనుక ఎంత కృషి ఉండి ఉంటుందో కదా!

అందరూ ఎదురు చూస్తున్నట్లుగానే మరియ కూడా యేసయ్య తన గర్భమున పుట్టాలని ఎంతగానో ఎదురు చూస్తూ తన కన్యత్వమును కాపాడుకుంటూ ఎంతో భక్తి శ్రద్ధలతో ప్రభుని ఆరాధిస్తున్న దినములలో ఉన్నారు అందరూ. కాని రాబోవు శ్రమలు, అవమానములు, నిందలు ఎంత ఎక్కువగా ఉంటాయో ఆనాడు కన్యకలకు తెలియదు. లూకా 2:34 "ఇదిగో అనేక హృదయాలోచనలు బయలుపడునట్లు ఇశ్రాయేలీయులలో అనేకులు పడుటకు, తిరిగి లేచుటకు వివాదస్పదమైన గురుతుగా ఈయన (యేసయ్య) నియమింపబడియున్నాడు మరియు మరియా నీ హృదయములోనికి ఒక ఖడ్గము దూసుకొని పోవును అని చెప్పెను. కనుకనే ఆయన సమస్తమును ముందుగానే ఎరిగిన వాడై మరియను తల్లిగా ఆమె గర్భమును ఏర్పరచున్నాడు.


ఆమె అంత ఆశీర్వదింబడటకు కారణము ఆమె యేసయ్యను అంతగా ప్రేమించినది. ఈ లోకాన్ని జయించబోయే వాడు ఈ లోకమును రక్షింపగోరువాడు మానవాళి కోసం తన ప్రాణమునే గొఱ్ఱెపిల్లవలె బలిగా అర్పింపబోవుచున్నాడు. అని గ్రహింపగలిగినది మరియ. పరలోకపు జ్ఞానము కలిగినది మరియ. దైవ కార్యములను ముందుగా గ్రహించగలిగినది ఈ మరియ. ఆయన తన గర్భమున జన్మించాలని మనస్ఫూర్తిగా కోరుకున్నది. ఆయన కోసం ఎన్ని కష్టాలైనా భరించగలను అని గొప్ప దృక్పథము కలిగినది మరియ.

ఒక గొప్ప కార్యము చేయుటకు చాలా శక్తి అవసరము. అది మానవశక్తితో జ్ఞానముతో చేయలేము. దేవుని పరిశుద్ధాత్మ శక్తితోనే అది సాధ్యము అవుతుంది. నిజమే, మరియకు కూడా అదే ప్రశ్న తలెత్తింది. అందులోను ఒక పురుషునికి ప్రధానము చేయబడినది. ఆయనకు కూడా అవమానము, అనుమానమే. ఆయనను ఒప్పించే శక్తి ఆమెకు లేదు. నేను పురుషుని ఎరుగని దాననే ఇది ఎలా జరుగును? అని ఆమె ప్రశ్న వేసింది. నిజమే పురుషుని ప్రమేయం లేకుండా బిడ్డల తల్లి కావడం చాలా విడ్డూరము లోకులు కాకులు ఎన్నో విమర్శలు చేస్తారు. ఎన్నో ప్రశ్నలు వేస్తారు. వాటన్నిటికి జవాబు చెప్పినా మనుష్యులకు అర్థం కాదు. అప్పటికి అద్భుతాలు మనుష్యులకు తెలియదు. పరిశుద్ధాత్మ గురించి వారికి అర్థంకాదు. ఇవన్నీ ఆలోచించి మరియ ఇది ఎలా సాధ్యము అని తనలో తాను ఆలోచించుకొనుచూ ఉంది.

అప్పుడు దూత పరిశుద్ధాత్మ నీ మీదికి వచ్చును. సర్వోన్నతుని శక్తి నిన్ను కమ్ముకొనును. గనుక పుట్టబోవు శిశువు పరిశుద్ధుడై దేవుని కుమారుడు అని అనబడును. మరియను ఇంకా ధైర్యపరచుటకు ఆమె విశ్వాసమును లేక సందేహమును స్పష్టము చేయుటకు నీ బంధువురాలగు

**...మిగతా 23వ పేజిలో**

# క్రిస్మస్ పండుగ కాదు మహా పండుగ




క్రిస్మస్ ఆకస్మిక సంభవంకాదు. క్రిస్మస్ దేవుని అనాది సంకల్పం. కొందరు మత శాఖలవారు క్రిస్మస్‌ను అర్థం చేసికొనే దానికి బదులుగా అపార్థం చేసుకోవటం విచార కరం. యేసుక్రీస్తు జన్మద్వారా మానవలోకంలోని కలవరం కళ్యాణంగా మారింది. క్రిస్మస్ అంటే దేవుడు, మానవుడు అయిన రోజు, దేవుడు నిత్యత్వం నుండి కాలంలోనికి అడుగిడిన మంచిరోజు. దేవుని చిత్తం సిద్ధించినరోజు. రక్షణ ప్రణాళిక రూపుదిద్దుకొన్న మంచిరోజు.

## క్రిస్మస్ పండుగ కాదు మహాపండుగ

చాలామంది క్రిస్మస్‌ను కేవలం పండుగగా భావిస్తారు. క్రిస్మస్ పండుగ మాత్రమే కాదు మహాపండుగ. ఎందుకు ఇది మహాపండుగ అంటే? మహాదేవుడైన యేసుక్రీస్తు ప్రభువు ఆవిర్భవించిన శుభదినం గనుక. యేసుక్రీస్తు కేవలం దేవుడు మాత్రమే కాదు ఆయన మహాదేవుడు. "మహాదేవుడును మన రక్షకుడైన యేసుక్రీస్తు" అని బైబిల్ గ్రంథం సెలవిస్తుంది. (తీతు 2:13) ఆ మహాదేవుని జననదినం మహాపండుగ కాకపోతే మరేమవుతోంది? ఇది ఎందుకు మహాపండుగగా పరిగణించబడిందో మరో ముఖ్యమైన విషయం కూడా మనం ప్రస్తావించుకోవాలి. ప్రపంచ జనాభాలో క్రిస్టియన్లు అధిక సంఖ్యాకులు. ఈ అధిక సంఖ్యాకులైన క్రైస్తవులు భక్తి భావాలతో జరిగించుకొనే అతిపెద్ద పండుగ క్రిస్మస్ పండుగ. భారతదేశములో పెద్దపండుగ ఏదో మనకు తెలుసు. క్రిస్మస్ భారతదేశంలో మాత్రమే కాకా యావత్ ప్రపంచంలోనే అతిపెద్ద పండుగ. పైకారణాలనుబట్టి క్రీస్తు జయంతి అనబడు క్రిస్మస్ పండుగ కేవలం పండుగ మాత్రమే కాదు మహాపండుగ అని మనం గ్రహించాలి. కీ॥శే॥ అబ్రహాం లింకన్ జన్మ దినోత్సవాన్ని అమెరకా దేశస్తులు మాత్రమే జరిగించు కొంటారు. మహాత్మాగంధి జన్మదినోత్సవాన్ని భారతీయులు మాత్రమే జరిగించుకొంటారు. కాని క్రీస్తు జయంతి ఒక్క దేశానికో ఒక్క ప్రాంతానికో సంబంధించినది కాక, యావత్ ప్రపంచానికి సంబంధించిన పండుగ క్రిస్మస్ పండుగ. మానవుడు చంద్రమండలముపై అడుగుపెట్టడం కంటే దేవాదిదేవుడు సృష్టికర్త భూమండలంపై అడుగుపెట్టడం గొప్ప విశేషం. నేలకోరిన నింగినేస్తం యేసుక్రీస్తు.

## క్రిస్మస్ ఆనందంకాదు - మహానందం

"వారు ఆ నక్షత్రమును చూచి, అత్యానందభరితులై యింటిలోనికి వచ్చి, తల్లియైన మరియను ఆ శిశువును చూచి సాగిలపడి, ఆయనను పూజించి తమ పెట్టెలువిప్పి బంగారమును, సాంబ్రాణిని, బోళమును, కానుకలుగా ఆయనకు సమర్పించిరి." (మత్తయి 2:10-11) తూర్పు దేశపు జ్ఞానులు యేసు బాలుని చూచి అత్యానందభరితు లయ్యారు. ఆనందమును మించింది అత్యానందం ఆసక్తిని మించింది అత్యాసక్తి. తూర్పుదేశపు జ్ఞానులు యేసును చూచిన తరువాత వారి ఆనందానికి అవధులు లేవు.

మనం కూడ యేసునుబట్టి అత్యానంద భరితులం కావాలి. మనం క్రీస్తునందే ఆనందించాలి. క్రీస్తునందు విశ్వాసముంచినవారు ఆయననుబట్టి ఆనందించగలరు. అందుకే అపొస్తలుడైన పౌలు క్రీస్తునందు ఆనందించండి. అని మరీ మరీ ఉద్బోధించాడు. సంతోషం ఆనందం జంట పదాలు. ఇవి రెండు ఒక్కటికాదు. వీటికి వేరువేరు భావాలున్నాయి. సంతోషం మన జీవితాలలో జరిగే సంభావాల మీద ఆధారపడి ఉంటుంది. సంతోషం కొంత కాలం ఉంటుంది. కాని ఆనందం పరలోక సంబంధమైనది. ఇది మానవహృదయంలో శాశ్వతకాలం ఉంటుంది. ఆనందం వ్యక్తిగతమైనది. సంతోషం పదిమందితో కలసి జరిగించుకొనేది. యేసు జన్మనుబట్టి అందరం కలిసి సంతోషిస్తాం. యేసు నా కొరకు జన్మించాడని నా హృదయంలో నేను ఆనందిస్తాను. ఆనందం వైయక్తికం.

క్రిస్మస్ దినాన రాత్రి వార్తలు చూడండి. క్రిస్మస్‌ను క్రైస్తవులు కడు వైభవంగా జరిగించుకొన్నారు. అని చెపుతూ క్లబ్బుల్లో త్రాగి నాట్యం చేసే యువతి యువకులను చూపిస్తారు. వాస్తవానికి ఇది క్రిస్మస్ సంతోషము కాదు. ఆనందం అంతకంటే కాదు. ఇలా చేయడం ద్వారా యేసు బాలుణ్ణి పురిట్లోనే హత్య చేసిన వారమవుతాం. క్రిస్మస్ అంటే మితిమీరి తినటంకాదు, మితిమీరి త్రాగటం అంతకంటే కాదు. మత్తయి సువార్త 3వ అధ్యాయములో జ్ఞానులు అత్యానంద భరితులు కావడానికి కారణం:

1. వారి అన్వేషణ. 2. వారి ఆరాధన. 3. వారి అర్పణ.

ప్రియ విశ్వాసీ! క్రీస్తు జన్మనుబట్టి నీవును అత్యానంద భరితుడవు కావాలని దేవుడు ఆశపడుతున్నాడు.

## క్రిస్మస్ సంతోషముకాదు – మహాసంతోషము

"ఇదిగో ప్రజలందరికి కలుగబోవు మహాసంతోష కరమైన సువార్తమానము నేను మీకు తెలియజేయుచున్నాను." (లూకా 2:10) అని స్వర్గలోక దూతలు భూమిపై గానం చేశారు. ఇది ఒక్కరిగానం కాదు. ఇద్దరి గానంకాదు. గొప్ప సైన్యసమూహ గానం. పరలోకం నుండి భూమిమీదకు వచ్చి గానం చేశారు. వీరాలపించిన మధురగానంలో "ప్రజలం దరికి కలుగబోవు మహాసంతోషకరమైన సువర్త మానము" అని పాడారు. అంటే క్రిస్మస్ కేవలం సంతోషం కాదని, అది మహాసంతోషమని మనకు విదితమవుతోంది. సంతోషం అనునది ఒంటరిగా జరిగించుకొనేది కాదు. ఇది కేవలం మనిషి అంతరంగానికి పరిమితం కాదు. ఇది అందరు కలిసి సామూహికంగా జరిగించుకొనేది. ఒక వ్యక్తి ఏకాంతముగా సంతోషించలేడు. ఇద్దరుకలిసి సంతోషించగలరు. యేసుక్రీస్తు జననంతో అటు పరలోకం ఇటు భూలోకం సంతోషభరిత మయింది. మనుషులు పోగొట్టుకొనిన ఈ సంతోషం యేసుక్రీస్తు రాకతో తిరిగి పొందగలిగారు. యేసుక్రీస్తు అనేక పర్యాయములు ఈ సంతోషమును గూర్చి ప్రబోధించాడు. లూకా శుభవార్త 15 అధ్యాయంలో

1. తప్పిపోయిన గొర్రె దొరికినపుడు యజమాని ఇంటికి వచ్చి తన స్నేహితులను పొరుగువారిని పిలిచి మరీ సంతోషించాడు (లూకా 15:5).

2. పోగొట్టుకొనిన నాణెం దొరికినపుడు ఆ స్త్రీ తన చెలికత్తెలను పొరుగువారిని పిలిచి మీరు నాతో కలిసి సంతోషించుడి అని చెప్పింది (లూకా 15:9)

3. అలాగే తప్పిపోయిన కుమారుడు తిరిగి ఇంటికి వచ్చినపుడు తండ్రి అందిరతో కలిసి సంతోషించాడు గమనించండి. పై లేఖనాలనుబట్టి చూస్తే సంతోషం స్నేహితు లతో ఇరుగుపొరుగు వారితో కలిసి ఉత్సాహంగా జరిగించు కొనేది. క్రిస్మస్ కూడ ఒంటరిగా జరిగించుకొనే పండుగకాదు. మన బంధువులతో స్నేహితులతో జరిగించుకొనే పవిత్ర పండుగ క్రిస్మస్. క్రిస్మస్ సంతోషం కాదు. మహాసంతోషం. ఈ మహాసంతోషం అనుమాట కొన్ని సందర్భాలలో మాత్రమే బైబిల్‌గ్రంథంలో వ్రాయబడింది.

1. రక్షకుని జన్మవార్త మహాసంతోషంతో కూడిన శుభవార్త

2. అన్యజనులు రక్షణ అంగీకరించినపుడు క్రైస్తవ సంఘము నకు మహాసంతోషం కలిగింది. (అపొ.కార్య. 15:3)

3. శుభవార్తచే పట్టణమును సువార్తికులు నింపినపుడు ఆ పట్టణము మిగుల సంతోషముతో నింపబడింది. (అపొ.కార్య 8:8)

4. "ఆత్మఫలం" లో రెండవది సంతోషం. దేవుడు క్రిస్మస్‌ను మనకు మహాసంతోషంగా మార్చాడు. దేవునికి స్తోత్రము.

## క్రిస్మస్ వార్త కాదు – శుభవార్త

"ఇదిగో ప్రజలందరికి కలుగబోవు మహాసంతోషకర మైన సువర్తమానము" (లూకా 2:10) ఈ వచనంలో సువర్త మానము అని వ్రాయబడి ఉంది. అంటే క్రిస్మస్‌ను గురించిన వార్త కేవలం వార్త కాదు అది శుభవార్త. వార్తకు – శుభవార్తకు ఎంతో వ్యత్యాసం ఉంది. వార్త భూసంబంధ మైనది. వార్త అనుమాట NEWS అను ఆంగ్లపదం నుండి వచ్చింది. N అంటే NORTH, E అంటే EAST, W అంటే WEST, S అంటే SOUTH. భూమి నలువైపుల నుండి వచ్చింది వార్త. దీని ద్వారా వార్త భూసంబంధమైందని మనకు ఎవ్వరూ చెప్పకనే తెలుస్తుంది. హత్యలు, దోపిడీలు, ఆర్థిక విషయాలు, రాజకీయ విషయాలు, సాంఘీక విషయాలు, సాంస్కృతిక విషయాలు వీటన్నిటిని కలిపి వార్త అని అంటాము. వార్త భూసంబంధమైంది. వార్తను పాత్రికేయులు తెస్తారు.

శుభవార్త: వార్తకు భిన్నమైంది శుభవార్త. శుభవార్త పరలోకం నుండి వచ్చింది, వార్త భూలోకానికి చెందింది.

వార్త మనుష్యులకు సంబంధించింది. శుభవార్త దేవునికి సంబంధించింది. శుభవార్త లేక సువార్త అంటే యేసుక్రీస్తు నా కొరకు వచ్చాడు. నా కొరకు చనిపోయాడు. నా కొరకు మృతి గెలిచి లేచాడు. రెండవ పర్యాయం తిరిగి రానై యున్నాడు. దీనినే మనం సువార్త అంటాము. ఈ శుభవార్త మహాసంతోషకరమైన శుభవార్త. దేవుడు ఈ సువార్తను తన దూతల ద్వారా మనకు పంపాడు. ఇది విమోచకుని గూర్చిన వార్త. తరతరాలుగా మానవులు ఎదురుచూస్తున్న జగద్రక్షకుని గూర్చిన వార్త. ఈ లోకంలో సువార్తను తృణీకరించువారు కొందరు, స్వీకరించువారు మరికొందరు, సిలువను గూర్చిన వార్త నశించుచున్నవారికి వెర్రితనము గాని రక్షింపబడుచున్న మనకు దేవుని శక్తి అని అపొస్తలుడైన పౌలు వ్రాసాడు. (1 కొరింథీ. 1:18) ఆరంభ దినాలలో శుభవార్తను మోసికొని పోవుటకు దేవుడు గబ్రియేలును వాడుకొన్నాడు. దూతల సమూహమును వాడుకొన్నాడు. దూతలు యేసుక్రీస్తు మరణం వరకే పనిచేసినట్లు బైబిల్లో మనం చూస్తాం. యేసు పునరుత్థానుడై లేచిన తర్వాత గబ్రియేలు మిఖాయేలులాంటి దూతలు మనకు కానరారు. యేసు పునరుత్థానుడైన వార్త తన శిష్యులకు అప్పగించాడు. ఇక దూతలతో పనిలేదు. మనమే ఆయన శుభవార్తను మోసికొనిపోయే దేవుని దూతలం. అందుకే సువార్తను మోసుకుని వెళ్ళేవారిని మనం సువార్తికులు అని అంటాము. సువార్తను ప్రకటించి ధన్యులైనవారు కొందరు. సువార్తను ప్రకటించక శపితులైన వారు మరికొందరు. సువార్త సువార్తికుని పోషిస్తుంది. కాని సువార్తను మనం పోషించం. శుభవార్తతో మన పల్లెలు, పట్టణాలు దేశాలు నింపబడాలని దేవుని అభీష్టం.

## క్రిస్మస్ కొందరికి కాదు - అందరికి

"ఇదిగో ప్రజలందరికి" అని లూకా భక్తుడు వ్రాసాడు. అంటే క్రిస్మస్ ఒక మతానికో, ఒక దేశానికో సంబంధించింది కాదు. ఇది అందరికి. క్రిస్మస్ క్రైస్తవుల పండుగ మాత్రమే అని చాలామంది అనుకొంటారు. క్రిస్మస్ కేవలం క్రైస్తవుల పండుగ మాత్రమేకాదు. ఇది ప్రజలందరికి పండుగ. మా ఇరుగుపొరుగు వారు "మీ క్రిస్మస్ పండుగకు మాకేం పెడుతున్నారు పాస్టర్‌గారూ!" అంటూ అడుగుతుంటారు. క్రిస్మస్ మా పండుగ కాదు అంటే వాళ్ళు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తారు. "అదేంటి? క్రిస్మస్ మీ పండగ కాదంటారు"? అంటే క్రిస్మస్ "మన" పండుగ అంటాను నేను. క్రిస్మస్ కొందరికి కాదు. క్రిస్మస్ అందరికి. క్రీస్తు ప్రభువు కొందరివాడుకాదు. అందరివాడు. యేసుక్రీస్తు మతోద్ధారకుడు కాదు. అలా మానవులు తలస్తే అది అపోహ మాత్రమే. యేసుక్రీస్తు ఒక మతాన్ని స్థాపించుటకు ఆయన అరుదెంచలేదు. ఆయన మనుష్యులందర్ని రక్షించుటకు వచ్చాడు. "తన ప్రజలను వారి పాపములనుండి ఆయన రక్షించును కనుక ఆయనకు యేసు అనుపేరు పెట్టుదురు." అని వ్రాయబడివుంది. (మత్తయి 1:21) తన ప్రజలు అంటే మనమే. మనందరిని రక్షించుటకు. పాపశృంఖలాలనుండి మానవ జాతిని విమోచించుటకు యేసు అరుదెంచాడు. "యేసుక్రీస్తు అందరికి ప్రభువు" అని బైబిల్ గ్రంథం సెలవిస్తుంది. జాగ్రత్తగా గమనించండి. యేసుక్రీస్తు 'కొందరికి' కాదు. అందరికి ఆయన ప్రభువు. యెషయా ప్రవక్త "మనకు శిశువు పుట్టెను, మనకు కుమారుడు అను గ్రహించబడెను" అని వ్రాసాడు. (యెషయా 9:6) 'మనకు' అంటే అందరి కొరకు. ఈ శిశువు ఈ కుమారుడు కేవలం మరియ యోసేపులకు మాత్రమే కాదు. ఈయన అందరి కొరకు ఆవిర్భవించిన అనంతదైవం.

"దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను" అని యోహాను సువార్తికుడు ఉద్బోధించాడు. దేవుడు లోకంలోని ఒక జాతికొరకు, ఒక మతం కొరకు, ఒక పట్టణం కొరకు, ఒక దేశం కొరకు రాలేదు. ప్రజలందరి కొరకు వచ్చాడు. లోకంలోని ప్రజలందరి కొరకు అరుదెంచాడు. లోకంలోని ప్రజలందరిని ప్రేమించాడు. అందులో నీవు, నేను ఉన్నాము. యేసు పశువుల కొట్టంలో జన్మించుటకు కారణం ఆయన అందరికి అందుబాటులో ఉండాలని. పశువుల పాకలోనికి – సత్రంలోనికి ఎవ్వరైనా వెళ్లవచ్చు. యేసు రాజభవనంలో జన్మిస్తే గొప్పవారికి మాత్రమే ప్రవేశం దొరికేది. ఆయన అందరికీ అందుబాటులోనున్న దేవుడు. ఆయన జన్మించిన పాలస్తీనా దేశం కూడా ప్రపంచానికి నడిబొడ్డు. ఇది కూడా ఒక గొప్ప మర్మం. ఆయన అందరికి అందుబాటులో ఉండాలని, ఆయన అందరికి చెందిన వ్యక్తిగా ఉండాలని ప్రపంచానికి స్థానమైన పాలస్తీనాను ఎంపిక చేసుకొన్నాడు. దేవునికి కృతజ్ఞతలు.

# వెల్స్ ఉజ్జీవము

(రెవ ఒలీవర్ ప్రైస్)



డా. విక్రాంత్ కొడవటికంటి

1904 సంవత్సర వసంతకాలములో ఇవాన్ రాబర్ట్స్ అను యౌవనస్థుడైన వెల్స్‌మాన్ అనేకమార్లు రాత్రి ఒంటిగంట నిద్రనుండి లేపబడి తెల్లవారు 5 గంటలు వరకు ప్రభువును ప్రార్ధనలో కలుసుకునేవారు. తర్వాత వెల్స్ ఉజ్జీవము రాగలిగినది. సంఘములన్నియు ప్రార్ధనకై కూటములుగా కిక్కిరిసిపోయేవి. ఒక యౌవ్వనస్థుల ప్రార్ధనా కూటమునందు పాస్టర్ జోసెఫ్ జెన్కిన్స్‌గారు సాక్ష్యములను చెప్పవలసినదిగా యౌవనస్థులను కోరిరి. కొన్నిదినముల క్రితమే ప్రభువును అంగీకరించి విశ్వాసిగా ఉన్న ఫ్లోరీ ఇవాన్స్ అను యౌవ్వనస్తురాలు లేచి నిలబడి అదురుచున్న కంఠ స్వరముతో నేను యేసును నా హృదయమంతటితో ప్రేమిస్తాను అని చెప్పెను. మిగిలిన యౌవ్వనస్థులందరి హృదయాలు కదిలింపబడ్డాయి. ఆ దినములలోనే ఎంతో శక్తివంతమైన ఆత్మీయ మేలు కొలుపు కలిగి 1,00,000 మంది ప్రజలు క్రీస్తునొద్దకు నడిపించబడిరి.

1904 సం॥ నవంబరు 7వ తారీఖున మోరియా అను మందిరము నిండునంతగా హాజరైన వారి ప్రార్ధనా కూటము తెల్లవారు జాము 3 గంటల వరకు కొనసాగినది. ఆత్మల సంపాదన బొగ్గు గనులకు వ్యాపించినది. అపవిత్రమైన లేక దైవ దూషణకరమైన మాటలు ఇక లేకుండెను. గనులలో పని చేయువారు దూషణకరమైన అపవిత్రమైన మాటలు పలుకకుండుట వారి గుర్రములకు సహితము ఆశ్చర్యము కలిగించెను. ఈ విధముగా పవిత్ర గంధముల కొరకు వెల్స్ వారు నవంబరు మరియు డిసెంబరు మాసములలో బైబిల్ సోసైటీ వారికి ఆర్డర్ మునుపటి సంవత్సరము పెట్టిన ఆర్డర్‌ల కంటే మూడురేట్లు ఎక్కువగా నుండెను. టైమ్స్ అను పత్రిక ఇంతటి మార్పు వెల్స్ ఉజ్జీవము వలననే కలిగెను. మరియు ఇట్టి ఆర్డర్స్ ఇచ్చుటలో వెనుకబడిపోవడం అనునది జరుగలేదు.

1905 జనవరి 1 నాటి లండన్ టైమ్స్ పత్రిక సెయింట్ జాక్స్‌టడ్ ప్రెస్బిటేరియన్ చర్చి యొక్క కాపరి. ఈ విధముగా ప్రకటించినట్లు తెలిపెను. అదే విధముగా శతాబ్దాలు కాలముగా చట్టములు ఏర్పాటు చేసినను సాధించలేనిది కంటికి కనిపించని పరిశుద్ధాత్మ శక్తి ద్వారా ఒక మాసములోనే సాధించగలిగెను. జనవరి 2న బిషప్ ఆఫ్ బేంగర్ ఈ విధముగా తెలిపిరి. వెల్స్ ఉజ్జీవము క్రైస్తవులలో ఉన్నటువంటి ఆధ్యాత్మిక నిర్లక్ష్యమును మరియు వారిమధ్య రగులుచున్న పగ లేదా చేదు అభిప్రాయములు సంఘములలో దుఃఖకరమైన విభజనలు అను అంశములపై ఎంతో తీవ్రమైన ప్రభావము చూపించెను. సంఘములన్నియు ఐక్య ప్రార్ధనా కూటములకు కలసిరావలసినదిగా పిలుపు నిచ్చిరి. వెల్స్‌నందు ఉత్సాహముతో కూడిన శక్తివంతమైన ఉజ్జీవము అంతకంతకు ప్రజ్వరిల్లినది. అని టైమ్స్ పత్రిక నివేదించినది. గుంపులు గుంపులుగా జన సమూహము కూటములకు హాజరగుచుండెడి వారు. బొగ్గుగనుల ద్వారబందములు పరిశుద్ధ గ్రంథము నందలి వాక్యములలో నింపబడెను. స్వాన్‌సీలో పిల్లలు తమ తల్లిదండ్రులను ప్రార్ధించు నిమిత్తమై పని స్థలమునుండి తోడ్కొని పోయిన కేసులను పోలీసులు ఎదుర్కొన్నారు. వెల్స్ ఉజ్జీవ ఉధ్యమము యొక్క పట్టుసడలుట లేక బలహీనపడుట అను సూచనలు కానరాలేదని జనవరి 10న టైమ్స్ పత్రిక ఎత్తిచూపెను. సంఘములన్ని మనఃపూర్వకమైన, తీవ్రమైన ప్రార్ధనాభారముతో మోకాళ్ళ మీద ఉండగా చరిత్రలో మొట్టమొదటిసారిగా స్వాన్‌సీలో జరుగు పార్టీలవద్ద కనీసం

త్రాగి మత్తులో ఉన్న వారు ఒక్కరు కూడ కనబడలేదు.

డేవిడ్‌లాయ్డ్ జార్జ్‌గారు వెల్స్ ఉజ్జీవమును గూర్చిన గొప్ప నిరీక్షణ కలవారై రానున్న దినములలో దేశమందలి ఉన్నత స్థానమందు అవినీతికి తావుండని పురోగతి చూడగలవని ఆశించారు. వీరు బ్రిటీష్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు వెల్స్ ఉజ్జీవము రాజకీయ ఊరేగింపులు లేక ఉత్సవాల కంటే మిన్నగా ఉండేది. 2వేల మంది సభ్యుల మధ్య యౌవ్వనస్థురాలి ప్రార్ధనను చూచి ఆయన ఎంతో ముగ్ధులయ్యారు. ఒక ఊరిలోని సారాయి అంగడిలో శనివారము రాత్రి కేవలము 9 సెంట్ల విలువ కలిగిన మద్యమును మాత్రమే అమ్మగలిగిరి. టైమ్స్ పత్రిక గమనించిన దేమనగా మొత్తము జనాభా అంతయు అకస్మాత్తుగా ఒకే సామాన్య ప్రేరణచే ఉత్తేజింపబడుట, ఆధ్యాత్మికత ప్రతి వ్యక్తికి వారి జీవితాలకు ముఖ్యమైన అవసరతగా గుర్తించబడెను. క్రిక్కిరిసిన ప్రార్ధనా సమావేశాలలో ఒకేసారి 6 నుండి 8 గంటల వరకు కలుసుకునేవారు. రాజకీయ సమావేశాలు, ఫుట్‌బాల్ మ్యాచ్‌లు కొంతకాలం పాటు వాయిదా చేయబడినవి. ట్రేడ్ యూనియన్ మరియు నాన్ యూనియనిష్టుల మధ్య కలహములు సమసిపోయెను.

గ్లిన్‌నీట్‌యందున్న ఇండిపెండెంట్ సంఘముల వారిమధ్య 10 లేక 12 సంవత్సరములుగా నెలకొనియున్న కలహము సమసిపోయి. రెండు సంఘముల సేవకుల చేతులు కలిపి ఉమ్మడి ప్రార్ధనా ఆరాదనలు జరుపుకొనిరి. సాల్వేషన్ ఆర్మీవారు 1505 జనవరి 19వ దినమును ఒప్పుకోలు మరియు తగ్గించుకొను ప్రార్ధనా దినముగా ఇంగ్లాడు, ఐర్లాండ్ మరియు స్కాట్‌లాండ్, వేల్స్ అంతటా నియమించిరి. లండన్ టైమ్స్ ప్రకారము బ్రిటిష్ వెల్స్‌లోని ప్రధానమైన నగరాలన్నిటి యందు దినమంతయు జరుగు ప్రార్ధనా కూటములు ఏర్పరచబడెను. ఎడతెగని ఈ ప్రార్ధనలలో ప్రేరేపించబడిన వారంతా పాల్గొనిరి. ఆత్మీయ ఉజ్జీవపు సెగలు మరియు నీతినియమాలు అంతటా వ్యాపించుచుండెను.

బొగ్గు గనులలో పనిచేయువారు ప్రార్ధనా కూటముల యందు ఉదయము 3 గంటల వరకు ఉండిన తరువాత స్నానపానాదులను ముగించుకొని తన పనికి వెళ్ళెడివారు. అనేకమంది త్రాగుబోతులు వారి పాపములను ఒప్పుకొని క్రీస్తుని అంగీకరించిరి. 1905 ఫిబ్రవరి 2న టైమ్స్ పత్రిక ప్రకారము ఈ వెల్స్ ఉజ్జీవము మూలముగా అనేకులు దుష్కార్యములను అన్యాయము చేయుటను విడచిపెట్టిరి. యజమానులు వారి క్రింద ఉద్యోగుల పనిలోని నిపూనత మెరుగుపడుట గమనించిరి. సర్ మార్కంట్ విలియమ్స్ అను జడ్జిగారు ఈ విధముగా తెలిపిరి. త్రాగుడు, దానికి సంబంధించిన నేరములు గణనీయముగా తగ్గుట మూలంగా తన పని సులువు చేయబడినది.

వెల్స్‌నందు రగులుచున్న ఈ ఉజ్జీవపు జ్వాలలు ఇంగ్లండ్, ఐర్లాండ్, స్కాట్‌లాండ్‌లకును వ్యాపించెను. ప్రార్ధనా కూటములు రెట్టింపు ఆయెను. దాదాపు 2వేల మంది బ్రడ్ ఫోర్డ్ పట్టణమందలి ప్రార్ధనా కూటమునకు హాజరైరి. లీడ్స్‌పట్టణమునందు శామ్యుల్ భాడ్‌విక్ తన మందిరము దినమంతయు నిండుగ ఉండెనని తెలిపెను. కనికరము యొక్క మహా అద్భుతమైన పని ఒక కర్మాగారమందలి జీవితములనే మార్చి వేసెను. ఇంగ్లీషు పట్టణమైన ననీటన్ నందు 1905లో ఒక వారం పాటు జరిగిన ఐక్య ప్రార్ధనా కూటము మహిమకరమై ఉజ్జీవమునకు దారితీసెను. ద ప్రిన్స్ సినిమా హాలు ఆదివారము రాత్రికాల మందు 1500 మంజి ప్రార్ధించు విశ్వాసుల రక్షణను కోరుకొనే వారిలో కిక్కిరిసి పోయెను. బుల్‌వెల్ అను ప్రాంతములో బహునీచ స్థితికి దిగజారిపోయిన అనేకమంది త్రాగుబోతుల జీవితములు మార్చవేయబడెను. బెడ్ పోర్త్ షైర్ గ్రామములు రాత్రి యంతయు శక్తివంతమైన సువార్తీకరగా సిద్దపాటు కొరకైన ప్రార్ధనలకు సమయమును కేటాయించుకొని సమర్పించు కొనిరి.

ఎడిన్ బర్గ్‌నందలి షార్లెట్ చాపెల్ కాపరియైన జోసఫ్ కెంప్‌గారు 1904లో వెల్స్‌లో జరిగిన దేవుని బలమైన కార్యమును దర్శించిరి. తిరిగి తన స్వంత సంఘము నందు1905 సంవత్సరపు నూతన సంవత్సర దినమునకు ముందు రోజు ఒక అసాధారణమైన ప్రార్ధనా కూటము

మరియు పాపపు ఒప్పుకోలునకు నడిపించబడిరి. ఈ విధంగా బలమైన ఉజ్జీవము రెండు సంవత్సరాలుగా కొనసాగుచుండెను. శక్తివంతమైన సువార్తీకరగా పని ప్రారంబించబడెను. దాదాపు వెయ్యిమంది సువార్తను గురించి అడిగి తెలుసుకొనిరి. ఐరిష్ ప్రెస్బిటేరియన్ వారు ప్రార్ధన కొరకైనా పిలుపునిచ్చిరి. సాయంకాల మధ్యాహ్న ప్రార్ధనా కూటములు రెట్టింపు ఆయెను. ఐరిష్ మెథడిస్ట్ మరియు అనేక వర్గాలవారు ఒక విన్నూతమైన పరిశుద్ధాత్మ శక్తి యొక్క కృప మరియు విజ్ఞాపనను పొందగలిగిరి. లర్గన్‌నందలి ఉజ్జీవ సభలు మొదట ప్రెస్బిటేరియన్ మరియు మెదడిస్ట్ సంఘపు వారిలో నిండిపోయెను. సారాయి దుకాణము లన్నియు ఖాళీ అయిపోగా ఎన్నడు మందిరమునకు రానివారు రికార్డుస్థాయిలో వచ్చి క్రీస్తును అంగీకరించిరి.

ఉజ్జీవపు జ్వాలలు బెంగర్ యూనివర్సిటిలోనికి సహితము వ్యాపించెను. ఎట్లనగా మూడవ లేక నాల్గవ వంతు విద్యార్ధులు మాత్రమే తరగతులకు హాజరయ్యేవారు. ప్రార్ధనాస్తుతులతో మొదలయ్యే ఉజ్జీవపు ఉద్యమము ఒక ఐక్య ప్రార్ధనా కూటముగా కొంతమంది యౌవ్వన విద్యార్ధులు దుఖముతో నిండునంతగా జరిగేవి. 1905 సంవత్సరములో ఐర్లాండ్ దేశమందలి లండన్ డెర్రో కౌంటీలోని లోబోర్‌మోర్ అను స్థలమందు ఉన్న మొదటి ప్రెస్బిటేరియన్ సంఘమునకు ఫ్రెడ్.సి.గిబ్సన్ కాపరిగా నియమితులైన ఈ చిన్న పట్టణము ఆ దినములలో నైతికముగాను, ఆత్మీయంగాను నిర్జీవమైన స్థితిలో ఉండెను. అందువలన పాస్టర్‌గారు తన ప్రార్ధనలు మరియు భోదనల ద్వారా ఉజ్జీవము వచ్చులాగున దేవునితో ఒక నిబంధన చేసికొనెను. ఎంతో వ్యతిరేకత ఎదురైనప్పటికి దేవుని ఆత్మ కదలిక ద్వారా కఠినమైన పాపపు జీవితము కలిగినవారు అనేకులు ఎన్న తగిన మారుమనస్సు కలిగినట్టి మార్పును ఆ ప్రత్యేక కూటములలో చూడగలిగిరి.

దేవుడు దానిని మరలా చేయగలడు. ఆత్మీయ మేలు కొలుపునకై ప్రపంచములోని అనేకులతో కలిసి ప్రార్ధించుదాం.

దేవుడు మిమ్మును దీవించును గాక!!

**Wish you a Happy Christmas and Blessed New year!!**

## పాఠకులకు శుభవార్త

**'పరిశుద్ధత'** మాసపత్రిక ఇంటర్నెట్‌లో చదువుకొనే సౌకర్యము కల్పించామని తెలియజేయుటకు సంతోషిస్తున్నాము. వెబ్‌సైట్ పేరు **www.holinessmagazine.com.** ప్రస్తుతము మీరు 2014 సంచికలన్నీ డౌన్‌లోడ్ చేసు కొనవచ్చును. త్వరలో పాత సంచికలన్నీ ఇంటర్నెట్ నుండి డౌన్‌లోడ్ చేసుకొనే సౌకర్యం కల్పించటానికి ప్రయత్నిస్తాము. అంతేకాక శ్రీమతి మాధురి మరియన్‌గారు పాడిన **'పరిశుద్ధ గీతములు' (Holi Melodies)** ఎనిమిది సి.డి.ల పాటలు మరియు **క్రిస్మస్ పాటలు** వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. మీరు ఈ పాటలను వినవచ్చు, డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. త్వరలో **'పరిశుద్ధ ప్రవాహిని'** టి.వి. కార్యక్రమములో ప్రసారమయ్యే ప్రసంగాల వీడియోలను కూడా ఈ వెబ్‌సైట్ ద్వారా అందుబాటులోకి తేవాలన్న ఆలోచన ఉంది. ప్రార్థించండి. విదేశాలలో ఉన్న మీ బంధువులకు, స్నేహితులుకు తెలియజేయండి. దేవుడు మిమ్ములను దీవించును గాక!

**– ఎడిటర్**

# పండిత రమాబాయి



శ్రీమతి రిబ్కా విక్రాంత్

నా దేవుడైన యెహోవా ఎదుట నా పాపమును నా జనము యొక్క పాపమును ఒప్పుకొనుచు, నా దేవునికి విజ్ఞాపన చేయుచుంటిని (దాని 9:1-20)

అగ్ని మరింత అగ్నికి ఆజ్యపోస్తుంది. 1904లో ఆధునిక సంఘ యుగపు ఉజ్జీవములలో ప్రధానమైనది ఒకటి వేల్సులో సంభవించినది. ఈ వెల్స్ ఉజ్జీవమును గుర్చిన సమాచారము ప్రపంచమంతా వ్యాపించుటచేత అనేకులలో నిరీక్షణ, విశ్వాసములను రేకెత్తించినది. త్వరలో ఇండియా, చైనా, కొరియా మరియు అమెరికాలలో ఉజ్జీవపు మంటలు అలుముకున్నవి. ఇండియాలో కలిగిన ఉజ్జీవము నకు ఓ యౌవ్వనురాలైన పండిత రమాబాయి సాధనముగా నుండెను.

రమాబాయి యౌవ్వన వితంతువులు మరియు అనాధల కొరకై ఒక ఆశ్రమమును నెలకొల్పి, దానికి రక్షణ లేక విడుదల అనే అర్థమిచ్చు "ముక్తి" అని పేరు పెట్టింది. ఆమె ఇండియాలోని తృణీకరింపబడిన నిస్సహాయులైన వితంతువుల మధ్య శక్తివంతమైన ఉజ్జీవమును చూడవలెనని ఆశించింది. 1904 డిశంబరులో వెల్స్ ఉజ్జీవమును గూర్చి విన్నప్పుడు ఆత్మ కుమ్మరింపు కొరకైన ఆమె ఆకలి అధికమయ్యింది. ఆమె 10 మంది ఆడపిల్లలతో కూడిన అనేక ప్రార్థనా గుంపులను ప్రారంభించి భారతదేశము మరియు ప్రపంచములోని నామకార్ధ క్రైస్తవుల రక్షణ కొరకై ప్రార్థించమని కోరింది. ప్రారంభములో ఆమె ప్రార్థనా గుంపులలో 70 మంది మాత్రమే యుండిరి. ఆమె ఇంకా ఇతరమైన ప్రార్ధనా గుంపులు తమ స్నేహితులు, సహాయకులు మధ్య ప్రారంభించబడాలని పిలుపునిచ్చింది. వారు ప్రార్థించుటకై ఒకొక్కరికి రక్షింపబడని 10 మంది అన్యస్త్రీల నివేదిక ఇచ్చింది. 6 నెలలలోగా 550 మంది ముక్తి ఆశ్రమము వద్ద ప్రతిదినము రెండు పర్యాయములు ఉజ్జీవము కొరకై ప్రార్థించుటకై కూడిరి. 1905 జూన్ 29న కన్నీటితో పాపపు ఒప్పుకోలుతో, శక్తికొరకై మొర పెట్టుకున్న విస్తారమైన ఆడపిల్లల సమూహము మీదికి ఆత్మ కుమ్మరించబడినది. తరువాత దినమున రమాబాయి యోహాను 8వ అధ్యాయమునుండి బోధించుచుండగా, ఆత్మ శక్తివంతముగా దిగివచ్చెను. స్త్రీలు మరియు ఆడపిల్ల లందరు కన్నీటితో తమ పాపములు ఒప్పుకొన ఆరం భించిరి. అనేకులు తమయింటి పనులను మరియు తరగతులకు హాజరగుచుండగా పాపమును గూర్చిన ఒప్పుదలకు గురియైరి.

తరగతులకు సెలవు ప్రకటించి తమ పనులు ప్రక్కన పెట్టి ఆడపిల్లలు మరియు స్త్రీలు నిరంతర ప్రార్థనకు ఉపక్రమించారు. హృదయాంత రంగములను పరిశోదించే ఈ పశ్చాత్తాప దినాలలో అనేకమంది ఆడపిల్లలు తమలోని పాపశరీరమును గూర్చిన దర్శనములు చూచారు. పరిశుద్ధాత్ముడు తాము భరింపలేనంతగా తమ పాపములను కాల్చి శుద్ధీకరించుటచే అగ్ని బాప్తిస్మము పొందితిమని అనేకులు సాక్ష్యమిచ్చారు.

ఈ ఉజ్జీవమును గూర్చి ఇంకొకరు ఈ విధముగా నివేదించారు. ఇండియాలోని అమ్మాయిలు ఎంతో అద్భుతంగా మలచబడి ఆత్మ బాప్తిస్మమును పొందారు. తమ ఆత్మ అవసరతను గుర్తెరిగి తమ్మును తాము గుండెలు బాదుకొనుచు విలపించారు. వారికి గొప్ప వెలుగు

అనుగ్రహింపబడినది. వారు విడుదల పొందినపుడు ఎటువంటి అలసట ఎరుగకుండా గంటల కొలదిగా పైకి క్రిందికి గంతులు వేశారు. వారి మీదికి, లోనికి దహించే దేవుని అగ్ని వచ్చి వారిలోని గర్వము కోపము, లోకప్రేమ, స్వార్థము, అపవిత్రత మొదలైన శరీరకార్యములను కాల్చుచుండగా కేకలు వేశారు. వారు విజయము పొందు వరకు ఆహారము మరియు నిద్రలను విడనాడారు. వారు పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందినప్పుడు అత్యానందభరితులై రెండు, మూడు దినములు ఆహారమును కూడ లక్ష్య పెట్టలేదు. ఇట్టి నిజమైన ఉజ్జీవపుకాలములో పరిశుద్ధాత్మని కార్యములు అత్యధికమైనవి. అందుచేత పాపపు ఒప్పుకోలు మరియు రక్షణానందము తారస్థాయికి తీసుకురాబడినవి.

ముక్తిలో కొంతకాలమునుండి అక్కడి ఉజ్జీవమును గమనించిన జి. హెచ్. లాంగ్ ఇలా వ్రాశారు. చిన్నపిల్లలు గంటలకొలది సమయం యేసును ప్రేమించుటలో ఆరాధించుటలో లీనమైపోయారు. యౌవ్వన విశ్వాసులు అనేక గంటలు తమకు తెలియని, తాము చూడని వారి కొరకై ప్రార్థించుట అరుదైన ఆధిక్యతగా భావించారు. ఒక కూటములో మేము 17 గంటలు గడిపాము. ఆ తదుపరి దినమున 15 గంటలు గడిచిన తరువాత మహాఆనందంతో కూటం ముగించబడినది. ఉజ్జీవ సమయమున ఉద్వేగంగా అగుపడిన అనేకులు 20 సంవత్సరముల తరువాత కూడ స్థిరముగా దైవిక జీవతములు కొనసాగించుచున్నారని పండిత రమాబాయి జీవిత చరిత్రను రచించిన డా॥ నికోల్ మెక్‌నికొల్ నివేదించారు.

పండిత రమాబాయి జీవితము మనము నిరీక్షగా వాక్యమును మనకు అన్వయించుకొనునట్లు బలమైన ప్రోత్సాహమునిస్తుంది. కేవలము దేవుని దర్శనము మరియు వెల్స్ ఉజ్జీవములో క్రీస్తుని తాజా పని గూర్చిన వార్తను మాత్రమే ఆయుధంగా చేసుకొని తన హృదయాన్ని స్పందిపజేసిన ఈ ప్రశస్త వనిత మునుపెన్నడు చేయని రీతిలో ప్రార్థించుటకు పూనుకుంది. దేవుడు గతములో తన సంఘమునకు చేసిన వాటి వెలుగులో మన నిరీక్షణకు కారణము లేదు! సంఘము పలుమార్లు ప్రార్థనా లేమి మరియు నిరీక్షణగా లేమిలో ఉండుటకు ప్రధానకారణమే మనగా అది దేవుని మహా గొప్పకార్యములను మరచి పోయింది. యెహోవాను ఆశ్రయించుడి ఆయన బలము నాశ్రయించుడి ఆయన సన్నిధి నిత్యము వెదకుడి. ఆయన చేసిన ఆశ్చర్యకార్యములను జ్ఞాపకము చేసుకొనుడి. ఆయన సూచక క్రియలను ఆయన నోటి తీర్పులను జ్ఞాపకము చేసుకొనుడి. (1దిన 16:11,12).

("నేను ప్రభువైన యేసువలన పొందిన పరిచర్యను తుద ముట్టింపవలెనని, నా ప్రాణమును నాకెంత మాత్రమును ప్రియమైనదిగా ఎంచుకొనుట లేదు"అపో.కార్య 20:24)

దేవుడు మిమ్మును దీవించునుగాక.

**క్రిస్మస్ మరియు నూతన సంవత్సర శుభాకాంక్షలు!!**





**పాఠకులకు, చందాదారులకు,**

**ప్రకటన కర్తలకు, శ్రేయోభిలాషులకు**

**క్రిస్మస్ మరియు**

**నూతన సంవత్సర శుభాకాంక్షలు!!**

**- ఎడిటర్ మరియు సిబ్బంది**

**14వ పేజీ తరువాయి....**

ఎలీసబెతు కూడా తన వృద్ధాప్యమందు ఒక కుమారుని ధరించియున్నది. గొడ్రాలనబడిన ఆమెకు ఇది ఆరవ మాసము. దేవుడు చెప్పి యే మాటయైనను నిరర్థకము కానేరదని చెప్పెను. అందుకు మరియ ఇదిగో ప్రభువు దాసురాలను నీ మాట చొప్పున నాకు జరుగును గాక. అంతట దూత ఆమె యొద్ద నుండి వెళ్ళెను.

చూడండి మరియు విశ్వాసమును బలపరచెటంత వరుక మరియ నీ మాట చొప్పున జరుగును గాక అని చెప్పే వరకు దూత మరియ యొద్దనే వున్నది. మరియను ఆత్మలో బలపరచింది.

నిజమే, మనుషులము ఇటువంటి విషయాలలో త్వరగా నిర్ణయము తీసుకోవాలంటే చాలా భయపడతాము. ఏమౌతుందో ఎలా మనుషులు దీనిని స్వీకరిస్తారో అని ఆలోచనలో పడతాము. కాని వాక్యము ఏమి మాట్లాడు తుందంటే సత్యము మిమ్మును సర్వసత్యములోనికి నడిపించును గాక!. దేవునికి అసాధ్యమైనది ఏదీ కూడా లేదు. మన కుటుంబములో ఏదైనా గొప్ప మేలు ఆయన చేయగలడు. మనము నమ్ముటమే ఆలస్యం, ఓపికతో ఎదురు చూడాలి. కనిపెట్టి ఓపికతో ప్రార్థించాలి. ప్రభువు తప్పక కార్యము చేస్తాడు.

దేవునిని గూర్చి మనకు పూర్తి నమ్మకం కలిగినట్లయితే ఆయన కొరకు మనం నిలువబడతాము. శ్రమలైనా, హింసలైనా, నిందలు, అవమానములైనా ఒక గొప్ప కార్యము మన ద్వారా జరుగుటకు మనం మౌనంగా భరిస్తాము. అందుకే మరియను 'స్త్రీలలో నీవు ఆశీర్వ దింపబడిన దానవు. నీ గర్భఫలమును ఆశీర్వదింపబడును' అని లోకమంతా ఆమెను కొనియాడునట్లుగా దేవుడు ఆమెను ధన్యురాలు అని ఆశీర్వదించాడు. దేవుడు మిమ్ములను కూడా ఆశీర్వదించును గాక!

**మీ అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు**

## బైబిల్ క్విజ్ - 4 జవాబులు

1. రిబ్కా
2. బెతూయేలు
3. లాబాను
4. కెతూరా
5. 175 సం॥లు
6. 40 సం॥లు
7. ఏశావు
8. యాకోబు
9. మడిమెను పట్టుకొనినవాడు
10. 60 సం॥లు
11. 15 సం॥లు
12. కలగూరవంటకము
13. జ్యేష్ఠత్వమును
14. వేటాడిన మాంసమును వండి తెమ్మనెను
15. తనకు రావలసిన ఆశీర్వాదములు తీసుకున్నందుకు
16. లాబాను దగ్గరకు
17. బేతేలు

18 ఉప్పుస్తంభము అయిపోయింది

19. లేయా
20. 14 సం॥లు
21. 6గురు, రూబేను, షిమ్యోను, లేవీ, యూదా, ఇశ్శాఖారు, జెబూలూను
22. బిల్హా - దాను, నఫ్తాలి
23. జిల్పా - గాదు, ఆషేరు
24. దీనా
25. పుత్రదాత వృక్షఫలములు



# అక్షరయజ్ఞం

**బైబిల్ క్విజ్ - 5**

మత్తయి, లూకా సువార్తల నుండి



శ్రీమతి కె. ప్రసన్న పరాక్రమ్

## క్రిస్మస్ స్పెషల్

1. అబ్రాహాము నుండి క్రీస్తు వరకు ఎన్ని తరములు?
2. ఇమ్మానుయేలు అను పేరుకు అర్థమేమిటి?
3. యేసు ఏ ఊరిలో జన్మించెను?
4. శిశువైన యేసుని దర్శించుటకు జ్ఞానులు ఎక్కడ నుండి వచ్చెను?
5. జ్ఞానులు కానుకలుగా ఏమి సమర్పించిరి?
6. మరియ భర్తయైన యోసేపు ఏ వంశస్థుడు?
7. మొదటి ప్రజాసంఖ్య వ్రాయవలెనని ఆజ్ఞ అయ్యినప్పుడు సిరియా దేశమునకు అధిపతి ఎవరు?
8. ప్రజాసంఖ్యలో నమోదు కొరకు యోసేపు, మరియలు ఎక్కడ నుండి బయలుదేరిరి?
9. యేసు పుట్టినప్పుడు సత్రములో స్థలము లేనందున ఆయనను ఎక్కడ పరుండబెట్టిరి?
10. యేసును చూచుటకు గొఱ్ఱెల కాపరులు ఎక్కడకు వెళ్ళిరి?
11. యేసు అను మాటకు అర్థమేమిటి?
12. క్రీస్తు అను మాటకు అర్థము ఏమిటి?
13. యేసు పుట్టిన ఎన్ని దినముల తర్వాత సున్నతి చేసిరి?
14. శిశువైన యేసును దేవాలయములోనికి తీసుకొని వచ్చినప్పుడు ఆయనను ఎత్తికొని దేవుని స్తుతించినది ఎవరు?
15. శిశువైన యేసును చూచుటకు దేవాలయము లోనికి వచ్చిన వృద్ధురాలైన ప్రవక్త్రి పేరేమి?
16. దేవాలయములో యేసును ప్రతిష్ఠించిన తరువాత వారు ఏ ఊరికి వెళ్ళిరి?
17. ఏ పండుగను ఆచరించుటకు యేసు తల్లిదండ్రులతో కలసి యెరూషలేము వెళ్ళెను?
18. యేసు పండుగలో తప్పిపోయినప్పుడు ఆయన వయస్సెంత?
19. ఎన్ని దినముల తర్వాత వారు యేసును కనుగొనిరి?
20. యేసు బోధింప మొదలు పెట్టినప్పుడు ఆయన వయస్సెంత?

**గమనిక :** ఈ ప్రశ్నలన్నిటికి సమాధానాలు బైబిలు నుండి గ్రహించవచ్చును. మీరు ఈ బైబిల్ క్విజ్‌లో పాల్గొనటం ద్వారా బైబిలు జ్ఞానమును సంపాదించాలన్నదే మా ఉద్దేశ్యం. కావున ప్రతి ఒక్కరూ ఈ బైబిల్ క్విజ్‌లో పాల్గొని బైబిలు జ్ఞానము సంపాదించటంతో పాటు బహుమతులు గెలుపొందవలసినదిగా కోరుచున్నాము.